# లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు

మండలి బుద్ధప్రసాద్









తెలుగు సమితి



లండన్‌లోని బిగ్‌బెన్ గడియారం వద్ద
డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శ్రీ మండలి బుద్ధప్రసాద్

# లండన్‌లో
# తెలుగు వైభవ స్మృతులు


**మండలి బుద్ధప్రసాద్**



**తెలుగు సమితి**

హైదరాబాద్

**తెలుగు వైభవ స్మృతులు**
రచయిత : **మండలి బుద్ధప్రసాద్**

ముద్రణ : **ఏప్రిల్, 2010**

వెల : రూ. 25/-

ప్రచురణ :
**తెలుగు సమితి,** హైదరాబాద్

ప్రతులకు :
**ఎమెస్కో బుక్స్**
సూర్యారావు పేట, విజయవాడ - 520 002
ఫోన్స్ : 0866-2436643, 9849992890
దోమల్‌గూడ, హైదరాబాద్ - 500 029
E-mail : emescobooks@yahoo.com

ప్రింటింగ్ :
**సాయిలిఖిత ప్రింటర్స్**
ఖైరతాబాద్, హైదరాబాద్-4.
ఫోన్: 65545979

తెలుగు భాషాభానుడు సి.పి. బ్రౌన్ సమాధిని

పునరుద్ధరించి - పరిరక్షించిన

**లండన్ తెలుగు సంఘం (తాల్)** వారికి

**"లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు"**

కృతజ్ఞతాపూర్వక 'కానుక'గా సమర్పిస్తున్నాను.

# విషయసూచిక


| | |
|---|---|
| నా ఇంగ్లాండ్ పర్యటన... మధుర స్మృతులు | 1 |
| బ్రిటీష్ మ్యూజియంలో మన అమరావతి శిల్పాలు | 17 |
| మన కొల్లూరు - కోహినూర్ వజ్రం | 36 |
| తెలుగు భాషా భానుడు సి.పి. బ్రౌన్ | 53 |
| తెలుగు భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ | 65 |
| ఆంగ్ల సాహిత్యానికి విశేష సేవలందించిన తెలుగుతేజం డా. గూటాల కృష్ణమూర్తి | 78 |



## కృతజ్ఞతలు

ఈ గ్రంథ రచనకు తోడ్పాటు అందించిన డా॥ గంధం సుబ్బారావుకి, ఈ గ్రంథాన్ని అందంగా తీర్చిదిద్ది ప్రచురించిన మిత్రుడు **'రైతునేస్తం'** సంపాదకులు, సాయిలిఖిత ప్రింటర్స్ అధినేత శ్రీ వై. వేంకటేశ్వరరావుకి, **'ఎమెస్కో'** శ్రీ విజయకుమార్‌లకు కృతజ్ఞతాభినందనలు.

# నా ఇంగ్లాండ్ పర్యటన...
# మధుర స్మృతులు

ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీయూనియన్ యు.కె. 2009 మే 2,3 తేదీలలో కోవెంట్రిలో జరుగుతుందని ఆ సమ్మేళనంలో అతిథిగా పాల్గొనవలసిందని, డాక్టర్ సుబ్బారావు వి. చదలవాడ, డాక్టర్ రమేష్ పొట్లూరి గార్ల వద్ద నుంచి నాకు, ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమి అధ్యక్షులు డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌గారి ద్వారా ఆహ్వానమందింది.

నేను ఎన్నికల రణరంగంలో తలమునకలుగా ఉన్నాను. 2009 ఏప్రిల్ 23వ తేదీన ఎన్నిక పోలింగ్ పూర్తయింది. 27వ తేదీన మేమిరువురమూ లండన్‌కి పయనమైనాము.

నేను అమెరికా, చైనా, జర్మనీ మొదలైన దేశాలు అప్పటికే సందర్శించి ఉన్నప్పటికీ, నా మనస్సు ఇంగ్లాండు వైపు చూస్తుండేది. దానికి కారణం మనదేశాభివృద్ధికి, ప్రత్యేకించి తెలుగుజాతి అభ్యుదయానికి కారకులైన వారిపై నాకు చిన్ననాటి నుండి అభిమానం ఉండడం కావచ్చు. తెలుగు భాషోద్ధారకుడు సి.పి. బ్రౌన్, కృష్ణ–గోదావరి డెల్టాల అభివృద్ధి కారకుడైన సర్ ఆర్థర్ కాటన్, భారతదేశాపు ప్రథమ సర్వేయర్ జనరల్‌గా పనిచేసి, కైఫీయత్తుల సేకరణ ద్వారా తెలుగువారి చరిత్ర రచనకు ఆధారభూతుడైన, అమరావతి తదితర బౌద్ధ స్తూపాల శిల్ప వైశిష్ట్యాన్ని వెలికితీసి లోకానికి చాటి చెప్పిన కల్నల్ కాలిన్ మెకంజీలపై తెలుగువారందరికీ లాగానే నాకు కూడ భక్తి భావం ఉంది. తెలుగుభాషకు అపారమైన సేవ చేసిన నేనెరిగిన మరో

ఆంగ్లేయుడు జె.పి.ఎల్. గ్విన్. ఇండియన్ సివిల్ సర్వీస్ అధికారిగా పనిచేశారు. తెలుగు అకాడమి స్థాపనలో విశేష సేవలందించారు. 1975లో జరిగిన ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలలో అంతర్జాతీయ తెలుగు సంస్థను నెలకొల్పవలసిందిగ శ్రీ గ్విన్ తీర్మానాన్ని ప్రతిపాదించారు.

మా నాన్నగారు శ్రీ మండలి వెంకటకృష్ణారావుగారికి గ్విన్‌తో సత్సంబంధాలు ఉండేవి. నా వివాహానికి గ్విన్ దంపతులు విచ్చేసి ఆశీర్వదించిన మధుర జ్ఞాపకం నా మదిలో మెదులుతూ ఉంటుంది. మా నాన్న గారు లండన్ వెళ్లినపుడు, వారు వచ్చి కలిశారు. మేము లండన్ వెళ్లినప్పుడు 1999 సెప్టెంబరులో గ్విన్ పరమపదించినట్లు తెలుసుకుని విచారించాను. గ్విన్ మన మధ్య లేకున్నా, వారు తయారు చేసిన ఇంగ్లీషు-తెలుగు డిక్షనరీ, ఆధునిక తెలుగు వ్యాకరణం తెలుగు భాషకు వారు అందించిన అమూల్యాభరణాలు. నా లండన్ పర్యటన ద్వారా వీరందరినీ ఒకసారి మనసారా గుర్తు చేసుకునే అవకాశం కలిగింది.

లండన్‌లో డా॥ గోవర్ధన్‌రెడ్డిగారి ఇంట్లో మా బస. వారు ప్రసిద్ధ వైద్యులు; బ్రహ్మచారి. మా కోసం బర్మింగ్‌హామ్ నుంచి డా॥ జమలాపురం హరగోపాల్ వచ్చారు. నిజాం రాజ్యంలో ఆంధ్ర మహాసభ ప్రముఖులు, హైదరాబాదు రాష్ట్ర విముక్తి పోరాటయోధులు సర్దార్ జమలాపురం కేశవరావుగారి కుమారుడని తెలుసుకుని ఆనందించాను. వారి మామగారు ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పద్మభూషణ్ డా॥ పాతూరు తిరుమలరావుగారు. డా॥ తిరుమలరావుగారితో సన్నిహితంగా మెలిగే అవకాశం నాకు విద్యార్థి దశలోనే కలిగింది. డా॥ గోవర్ధన్‌రెడ్డిగారు మితభాషి. డా॥ హరగోపాల్ చక్కటి సరస సంభాషణాచతురులు. వారి ఆతిథ్యం మాకెంతో ఆత్మీయ పూర్వకంగా లండన్‌లో లభించింది. స్వగృహంలో ఉన్న సంతృప్తి డా॥ గోవర్ధన్‌రెడ్డిగారి ఇంట్లో కలిగింది.

లండన్ తెలుగు సంఘం అధ్యక్షులు డా॥ రాములు దాసోజు మమ్మల్ని విందుకు ఆహ్వానించారు. అక్కడే మరో మిత్రుడు శ్రీ కోట మల్లేష్‌తో కూడా

పరిచయం కలిగింది. లండన్‌లో తెలుగు వారికి గొప్ప వేదిక  లండన్ తెలుగు సంఘం. లండన్‌లో పరిచయమైన శ్రీమతి వింజమూరి రాగసుధ నర్తకీమణి, మంచి కవయిత్రి. లండన్ తెలుగు సంఘంలో చురుకైన పాత్ర వహిస్తున్నారు.

**మేడమ్ తుస్సాడ్స్ :**


డాక్టర్ లక్ష్మీప్రసాద్‌తో కలిసి లండన్‌లో ముఖ్యప్రదేశాలు సందర్శించాను. అంతర్జాతీయ ప్రముఖుల మైనపు బొమ్మాలతో కూడిన మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం నన్నెంతో ఆకర్షించింది.  అక్కడ కొలువు తీరిన ప్రముఖుల బొమ్మలు 'సజీవ మూర్తులు' అని భ్రమింపచేస్తాయి. మహాత్మాగాంధీ, సచిన్ టెండూల్కర్, సల్మాన్‌ఖాన్ బొమ్మలు భారతదేశానికి ప్రాతినిధ్యం వహిస్తూ కనిపించాయి. ఆ ప్రతిమలతో ఫోటో దిగితే వాటిని చూసిన వారు నిజంగానే ఆ ప్రముఖులను కలసి తీసుకున్నారేమోనని తప్పక భ్రమిస్తారు.

మేడమ్ తుస్సాడ్స్ (1761-1850) ఫ్రాన్స్‌లోని స్ట్రాబర్గ్‌లో జన్మించారు. మాడలింగ్‌లో ప్రఖ్యాతిగాంచిన డా॥ ఫిలిప్పి కర్టియస్ వద్ద ఈమె తల్లి హౌస్ కీపర్‌గా పనిచేసేది. కర్టియస్ వద్దనే తుస్సాడ్స్ మైనపు బొమ్మలు చేయడం నేర్చుకున్నారు. ఈమె తయారు చేసిన మైనపు బొమ్మలు అనతికాలంలోనే మంచి ప్రాచుర్యం పొంది ఈమెకు కీర్తి ప్రతిష్టలు తెచ్చిపెట్టాయి. తుస్సాడ్స్ వాక్స్ మ్యూజియం లండన్‌లో ఒక గొప్ప  సందర్శన స్థలం. ఇప్పుడు ఈ మ్యూజియానికి ప్రపంచంలో ఎన్నో చోట్ల  బ్రాంచిలు కూడా ఉన్నాయి.


**ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీయూనియన్ :**

కొవెంట్రిలో ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీ యూనియన్ 2009 మే 2,3 తేదీలలో డా॥ సుబ్బారావు వి. చదలవాడ, డా॥ రమేష్ పొట్లూరి ఆధ్వర్యంలో జయప్రదంగ జరిగింది. నాలుగైదు వందలమంది తెలుగు వైద్యులు ఈ సమ్మేళనంలో పాలు పంచుకున్నారు. చాలామంది బంధుమిత్రులను అనుకోకుండా అక్కడ కలిసే అవకాశం కలిగింది. మా


# మేడమ్ తుస్సాడ్స్ మ్యూజియం చిత్రాలు














snacks
shop





ప్రాంతీయులు శ్రీమతి తార వడ్డె, డా॥ ఎస్. కృష్ణ, డా॥ హరనాథ్ వడ్డి, డా॥ చి. హరిమోహన్, డా॥ ధనంజయరావు చుండూరి, వారి సోదరులు మా అవనిగడ్డలో ప్రముఖ న్యాయవాది శ్రీ కంఠంనేని రవీంద్రరావుగారి కుమార్తె, అల్లుడు డా॥ వేములపల్లి రవి కలిశారు. డా॥ వెలగపూడి బాపూజీరావుగారి సంపాదకత్వాన వెలువరించిన ప్రత్యేక సంచిక చక్కటి వ్యాసాలతో, చిత్రాలతో ఆకర్షణీయంగ రూపొందించారు. ప్రసిద్ధ చిత్రకారుడు బాపు, డార్విన్ పరిణామక్రమాన్ని, దశావతారాలతో సమ్మేళనం చేస్తూ వేసిన ముఖచిత్రం ఎంతో ఆలోచనాత్మకంగా ఉంది. 200 ఏళ్ల క్రితం జన్మించిన డార్విన్ ప్రతిపాదించిన పరిణామక్రమ సిద్ధాంతానికి, వేల ఏళ్ల క్రితమే భారతదేశ పురాణాలలో దశావతారాల ద్వారా పరిణామదశలను సూచించిటం ద్వారా స్ఫూర్తి నిచ్చిందనే అర్థం వచ్చేటట్లు చక్కటి చిత్రాన్ని చిత్రించడం శ్రీ బాపూకే చెల్లింది.

ఈ సమ్మేళనంలో స్థానిక కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో ఆకర్షించాయి. ఈ పర్యటనలో శ్రీ సూర్యదేవర ప్రసాద్ దంపతులు, కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరిగారి కుమారుడు డా॥ గోవర్ధన చంద్, వారి సతీమణి శ్రీమతి సతి వారి ఇళ్లకు ఆహ్వానించి చక్కటి ఆతిథ్యమిచ్చారు. ప్రసిద్ధ కవి స్వర్గీయ దేవరకొండ బాలగంగాధర తిలక్ కుమారుడు డా॥ సత్యనారాయణ మూర్తి, మా నాన్నగారి స్నేహితులు డా॥ బాబూరావు చాపరాలను కలవడం ప్రత్యేకంగా ఆనందాన్నిచ్చింది.


డా॥ చదలవాడ సుబ్బారావు, శ్రీమతి ఉమాబాల దంపతులు చూపిన ప్రేమాభిమానాలు మరువలేము. డా॥ సుబ్బారావు నిగర్వి. పెద్దరికంలోను హుందాతనంలోను వారికి వారేసాటి. గుంటూరు ప్రముఖులు, ప్రసిద్ధ వైద్యులు, మాజీ శాసనసభ్యులు, సంఘసేవాపరాయణులు డాక్టర్ కాసరనేని సదాశివరావుగారి కుమార్తె శ్రీమతి ఉమాబాల. డా॥ సుబ్బారావుగారు తీరికలేని పనివత్తిడిలో ఉండి కూడా మమ్మల్ని తమ కారులో లేక్‌డిస్ట్రిక్ట్‌కు తీసుకెళ్లారు. సుందరమైన కొండచరియల నడుమ మనోహరమైన సరస్సులతో ప్రకృతి సౌందర్య శోభితమైన ప్రదేశాన్ని మాకు వారక్కడ చూపించారు.




ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీయూనియన్ సత్కారం శ్రీ మండలికి అందజేస్తున్న
డా॥ బాపూజీరావు, డా॥ గోవర్ధన చంద్ త్రిపురనేని దంపతులు



ఆంధ్ర మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీయూనియన్ సమావేశంలో డా॥ గోవర్ధన్‌రెడ్డి, డా॥ యార్లగడ్డ,
డా॥ సుబ్బారావు చదలవాడ, డా॥ సత్యనారాయణమూర్తి దేవరకొండ, శ్రీ మండలి



విండ్సర్ క్యాజిల్ వద్ద



బ్రిటీష్ మ్యూజియం వద్ద

## విండ్సర్ క్యాజిల్

ఇంగ్లండ్‌లో నేను చూసిన మహత్తర రాజప్రాసాదం విండ్సర్ క్యాజిల్. డా॥ హరగోపాల్ కారులో మమ్మల్ని అక్కడకు తీసుకు వెళ్లారు. ఎలిజబెత్ మహారాణికి సంబంధించిన రాజప్రాసాదం ప్రస్తుతం పురావస్తు ప్రదర్శనశాలగా ప్రతిరోజూ వేలాది యాత్రీకులను ఆకర్షిస్తున్నది. భారతదేశానికి సంబంధించిన అనేక కళాఖండాలు, టిప్పు సుల్తాన్ తలపాగా కుచ్చులతో సహా అక్కడ ప్రదర్శనలో చూసి ఆశ్చర్యపోయాము. టిప్పుసుల్తాన్‌ను ఓడించిన ఆంగ్లేయులు ఆయన తలపాగా కుచ్చులను ఈ ప్రదర్శనశాలకు తరలించి భద్రపరిచారు.

విండ్సర్ క్యాజిల్ బెర్క్ షైర్‌లోని ఇంగ్లీష్ కౌంటీలో ఉంది. ఇది బకింగ్ హామ్ పాలెస్ (లండన్)కు, హోలీరోడ్ పాలెస్ (ఎడింబరా)కు దీటుగా వున్న పురాతన కట్టడం. మహారాణి ఎలిజబత్ ఇక్కడ గడిపి వెళుతుంటారు. ఇది వెయ్యి సంవత్సరాలుగా బ్రిటిష్ పాలకుల కోటగా వున్నట్లు భావిస్తున్నారు.


## లండన్ టవర్

లండన్‌లో మేము చూసిన మరో మహత్తర కట్టడం లండన్ బ్రిడ్జ్. థేమ్స్ నది ఒడ్డున చైనీస్ రెస్టారెంట్‌లో అల్పహారం తీసుకుంటూ లండన్ బ్రిడ్జ్ సోయగాలను తిలకించాము. ఆ వంతెన మీద నడుచుకుంటూ, లండన్ టవర్‌కు వెళ్లాము. రెండు వేల సంవత్సరాల చరిత్ర గల కట్టడమది. ఆ ప్రాంతం రోమనుల ఆక్రమణలో ఉన్ననాటి నుంచీ ఈ వంతెన ఉందట. ఇదే ప్రదేశంలో కీ.శ. 50వ సంవత్సరంలో రోమన్లు సైనిక అవసరాల కోసం ఒక చెక్క వంతెనను నిర్మించారని, అది క్రమంగా ప్రస్తుత రూపును సంతరించుకుందనీ, చరిత్ర చెబుతున్నది. ఇప్పుడున్న బ్రిడ్జ్ 1967-1972 మధ్యకాలంలో నిర్మించబడింది.

టవర్ బ్రిడ్జిని దాటి, లండన్ టవర్‌ను సందర్శించాము. ఇది లండన్ నగరంలోని అత్యంత ప్రాధాన్యతగల యాత్రా స్థలాల్లో ఒకటి. ఇది క్రీ.శ.



లండన్ టవర్ బ్రిడ్జి వద్ద



డా॥ చదలవాడ సుబ్బారావు దంపతులు, డా॥ మదినేని గోపాలకృష్ణలతో...



లండన్ తెలుగు సంఘం అధ్యక్షులు డా॥ రాములు దాసోజు శ్రీమతి స్వదేశీ దంపతులతో...



థేమ్స్ నది ఒడ్డున

1080లో నిర్మితమైంది. లండన్ టవర్ ఒక దుర్గంగాను, రాజప్రాసాదంగాను, జైలుగాను చరిత్రపుటలకెక్కింది.

అత్యంత విలువైన 23,578 వజ్రాలు ఇక్కడి మ్యూజియంలో భద్రపరచబడ్డాయి. అందులో చరిత్ర ప్రసిద్ధిగాంచిన కోహినూర్ వజ్రం కూడా ఉండటం గమనార్హం.

ఎందరో యుద్ధ ఖైదీలు దారుణ హింసలకు గురై ఇక్కడ అసువులు బాశారు. ఈ కోటకు వున్న కొన్ని బురుజులు ఆ దారుణ కృత్యాలకు సాక్షులుగా నిలిచివున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధకాలంలో దీనిని యుద్ధ ఖైదీల ఉరితీతకు ఉపయోగించారు. ఇప్పటికి మరణశిక్ష పడ్డ ఖైదీలను ఇక్కడ ఉరి తీస్తారు.

వీరాధివీరులు యుద్ధాలలో ఉపయోగించిన యుద్ధ సామగ్రితోపాటు ఇక్కడ చూడవలసింది ఎంతో ఉంది.

లండన్ టవర్‌ను చూసి, థేమ్స్ నదిలో పడవలో విహరించి, లండన్ అందాలను తిలకించాము.

## వర్డ్స్‌వర్త్ నివాస గృహం

రెండువందల సంవత్సరాల క్రితం ప్రఖ్యాత ఆంగ్లకవి విలియం వర్డ్స్‌వర్త్ నివసించిన కుటీరాన్ని అద్భుతంగాను, అతి సుందరంగాను నిర్వహిస్తున్నారు. ఈ కాటేజిలోకి ప్రవేశించిన సందర్శకులు వర్డ్స్‌వర్త్‌తోను, ఆయన కుటుంబీకులు, సన్నిహితులతోను సంభాషించిన, గడపిన అనుభూతిని పొందుతారు.

ప్రకృతి ప్రేమికులైన వర్డ్స్‌వర్త్ తన స్నేహితుడు, కవి, స్యామ్యూల్ టేలర్ కోవెరిడ్జ్‌తో కలిసి 1799లో లేక్‌డిస్ట్రిక్ట్‌కు సందర్శనకు వెళ్లాడు. అక్కడి ప్రకృతి సోయగాలను పరవశించిపోయిన వర్డ్స్‌వర్త్ అక్కడే స్థిర నివాసం ఏర్పరచుకోవాలని ఆ క్షణమే భావించాడు. ఆ తరువాత కొన్ని నెలలకే అక్కడ



షేక్స్పియర్ నివాసం వద్ద



షేక్స్పియర్ ఇంటివద్ద విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ విగ్రహం వద్ద

ఒక ఇంటిని నిర్మించుకొని, తన సోదరి డోర్తీతో అక్కడికి తరలివెళ్ళి, అక్కడే వుండిపోయాడు.

ప్రశాంత వాతావరణం, కొండలు, కొండలను తాకుతున్న మేఘాలు, సన్నటి వర్షపు జల్లులు, ఎలాంటి వారికైనా కవితావేశం తెప్పించే ప్రకృతి అందాలు అక్కడ దర్శనమిస్తాయి. సహజంగా కవి అయిన వర్డ్స్‌వర్త్, ఈ వాతావరణంలో తన్మయుడై వ్రాసిన "I Wandared Lonely as a Cloud" వంటి కవిత్వం ప్రపంచ ప్రసిద్ధి పొందింది. డోర్తీ కూడా గ్రాసమర్ జర్నల్ వంటివి అక్కడి నుంచే వ్రాసింది.

వర్డ్స్‌వర్త్ నివసించిన "డోవ్ కాటేజి" సందర్శనలో ఆయన నిత్య జీవితం గురించి, రచనల గురించి, ఆయనను సందర్శించిన వారి గురించి సమగ్రమైన సమాచారం పొందవచ్చు. వర్డ్స్‌వర్త్ రచనల వ్రాత ప్రతులు కూడా అక్కడ మనం చూడవచ్చు.

ఈ పర్యటనలో నన్ను ఎక్కువ ప్రభావితం చేసిన విషయం ఇంగ్లాండ్ దేశీయులలో వారి కవులపట్ల గల అపార గౌరవాభిమానాలు. వారు నివసించిన ప్రదేశాలు చెక్కు చెదరకుండా కాపాడుతూ, వారు వాడిన వస్తువులు, వారి రచనలు ప్రదర్శనకు ఉంచి, వారి పేర ప్రయివేట్ ట్రస్టులను ఏర్పాటు చేసి, ఆర్థిక అవసరాలకు ప్రభుత్వంపై ఆధారపడకుండా, అవసరమైన డబ్బును, సందర్శకుల నుంచి, అభిమానుల నుంచి సేకరించి, స్మృతి చిహ్నాలను పదిలపరచడం, నన్ను అబ్బురపరిచింది. ఈ రకమైన ట్రస్ట్‌లు ఏర్పాటు చేసి మనదేశంలోని, ప్రత్యేకించి మన రాష్ట్రానికి చెందిన కవులు, కళాకారులు, నాయకుల స్మృతులను శాశ్వతం చేసే ప్రయత్నం చేయాలి.

## విలియం షేక్స్‌పియర్ జన్మస్థలం

ఇది ఇంగ్లాండ్‌లోని వార్‌విక్‌షైర్‌లో ఉంది. 16వ శతాబ్దపు ప్రఖ్యాత కవి విలియం షేక్స్‌పియర్ స్మారక మ్యూజియం ఇందులో ఉంది. 16వ శతాబ్దంలో

చెక్కతో షేక్స్‌పియర్ తండ్రి నిర్మించిన ఈ ఇంటిని అతి పదిలంగా కాపాడుతున్నారు. దీనిని "షేక్స్‌పియర్ బర్త్‌ప్లేస్ ట్రస్ట్" నిర్వహిస్తున్నది. దీనిని "సాహిత్య ప్రేమికుల మక్కా"గా వ్యవహరిస్తారు. ఇంగ్లాండ్ సందర్శనలో నన్ను అమితంగా అలరించిన ప్రదేశాల్లో ఇది ఒకటి. ఈ ఇంటి వెనుక భాగంలో ఒక చిన్న ఉద్యానవనం ఉంది. ఈ తోటలో షేక్స్‌పియర్ కాలం నాటి పూల మొక్కలను, ఔషధ మొక్కలను ఇక్కడ మనం చూడవచ్చు. ఈ తోటలోని విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ శిలాప్రతిమ నన్ను విశేషంగా ఆకట్టుకుంది. దీనిని అప్పటి బెంగాల్ ముఖ్యమంత్రి శ్రీ జ్యోతిబాసు బహూకరించారట. ప్రపంచ ప్రసిద్ధ కవి షేక్స్‌పియర్ నివాస ప్రదేశంలో విశ్వకవి రవీంద్రుని ప్రతిమను చూసి, భారతీయుడుగా నా హృదయం పులకించిపోయింది. భారతీయ సాహిత్యానికి దక్కిన అపురూప గౌరవంగా దీనిని నేను భావించాను.

## గార్థ్ హౌస్

డార్కింగ్ నగరంలో సర్ ఆర్థర్ కాటన్ నివసించిన ఇంట్లో ప్రస్తుతం "గార్థ్ హౌస్" పేరిట ప్రయివేట్ నర్సింగ్‌హోం-కం-ఒల్డేజి హోం నిర్వహించబడుతున్నాయి. దీనిని మహారాణిగారి వైద్యుడు లార్డ్ హార్టెన్ 1949లో అధికారికంగా ప్రారంభించాడు. ఒక సుందరోద్యానవనంలో గత శతాబ్దాంతంలో నిర్మించబడిన ప్రసిద్ధ భవనమిది. ఈ భవనం గదుల నుంచి చూస్తే, ఎత్తైన కొండలు, సువిశాలమైన ఉద్యానవనం, అందులో సమున్నతంగా నిలిచిన మహావృక్షాలు, పూలమొక్కలతో కనులపండువుగా దర్శనమిస్తూ, ఒడ్లను ఒరుసుకుంటూ పారే ప్రవాహాలు కనిపిస్తాయి. అదొక ప్రకృతి శోభతో అలలారే అద్భుత ప్రదేశం.

అక్కడి వారందరూ వయసు పైబడిన పిమ్మట ఈ గార్థ్ హౌస్‌లో చేరాలని ఉవ్విళ్ళూరుతుంటారట. ఇక్కడ వుండే ప్రతి ఒక్కరిని వ్యక్తిగత శ్రద్ధతో, వారెప్పుడూ మానసికోల్లాసంతో వుండేటట్లు చూడటమే తమ ధ్యేయమని నిర్వాహకులు చెప్పారు. ఇక్కడ దీర్ఘకాలిక వసతితోబాటు, స్వల్పకాలిక వసతి

కూడా ఉంది. కొందరు సెలవుల్లో వచ్చి, విశ్రాంతిగా కొన్నాళ్ళు గడిపి పోతుంటారు. ఇక్కడ చాలా కాలంగా ఉంటున్న వారంతా 80-90 ఏళ్ళ పైబడినవారే !

వృద్ధుల సంక్షేమం పట్ల ఆ దేశంలో ఉన్న ఆదరణా, వారి సంక్షేమానికి వారు చూపుతున్న ప్రాధాన్యతా ఈ పర్యటనలో నాకు స్పష్టమయింది.

**గీతాంజలి సంస్థ సాహిత్య గోష్ఠి :**

బర్మింగ్‌హాంలో "గీతాంజలి మల్టీ లింగ్వల్ లిటరరీ సర్కిల్" అని డా॥ కృష్ణకుమార్, వారి శ్రీమతి చిత్రాకుమార్ 1995లో "గీతాంజలి" అనే బాలకవయిత్రి కేన్సర్ వ్యాధితో మరణించగా ఆమె పేర ఈ సంస్థను ఏర్పరిచారు. భారతీయ భాషా కవులతో సాన్నిహిత్యం పెంచుకుని జాతీయ సమైక్యతకు ఈ సంస్థ దోహదపడుతున్నది. విశ్వహిందీ సమ్మేళనానికి ఈ సంస్థ ఎంతో సహకరిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమి అధ్యక్షులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను ఆహ్వానించి, సాహిత్య గోష్ఠిని ఏర్పాటు చేశారు. డా॥ కృష్ణకుమార్, బర్మింగ్‌హాంలో వున్న పలువురు భారతీయ సాహితీ ప్రియులు ఈ సమావేశానికి విచ్చేశారు. సాహిత్యాంశాల మీద జరిగిన చర్చలు ఆహ్లాదకర వాతావరణంలో జరిగాయి.

లండన్‌లో ఎన్ని మహత్తర కట్టడాలను చూసినా, ఇంగ్లండ్‌లో మన తెలుగు వైభవ చిహ్నాల మీదే నా మనసంతా కేంద్రీకృతమై ఉంది. ఆ విశేషాలను మన తెలుగువారు తెలుసుకోవాలని, తెలుగు వైభవ ప్రభావాలకు దోహదపడాలనీ ఆకాంక్షిస్తున్నాను.

★★★

# బ్రిటీష్ మ్యూజియంలో మన అమరావతి శిల్పాలు

**'ఏ యమృత క్షణమ్ముల సృజించిరో శిల్పకులీను లీజగ**
**ద్గేయములైన శిల్పముల; దెల్గు కళా ప్రతిభల్ చరిత్రలో**
**మాయని కీర్తి వెల్గినవి మంజుతరాంధ్ర విశిష్ట శైలికిన్**
**మా యమరావతీ కళకు మంగళగీతముపాడె లోకముల్"**

బ్రిటీష్ మ్యూజియంను సందర్శించే వేలాది యాత్రికులు అమరావతి శిల్ప సౌందర్యాన్ని తిలకించి ఆనందాశ్చర్యచకితులవుతుంటే, శ్రీ కొండూరి వీరరాఘవాచార్యులు గారి పై పద్యం గుర్తుకు వచ్చింది.

ప్రపంచ ప్రసిద్ధ పురావస్తు ప్రదర్శనశాలల్లో బ్రిటీష్ మ్యూజియం అత్యంత ప్రముఖమైంది. రవి అస్తమించని సామ్రాజ్యాన్ని పాలించిన బ్రిటీష్ చక్రవర్తులు ప్రపంచం నలుమూలల నుంచి సేకరించిన అద్భుత కళాఖండాలు బ్రిటీష్ మ్యూజియంలో కొలువై ఉన్నాయి. ప్రతిరోజూ వేలాదిమంది యాత్రీకులు దేశ విదేశాల నుంచి వీటిని సందర్శించడానికి వస్తుంటారు.

మనదేశం నుంచి అమూల్యమైన కళాసంపదను బ్రిటీష్ వారు తరలించుకుపోయారు. వాటిలో ప్రాముఖ్యం గల మన అమరావతి శిల్పాలు బ్రిటీష్ మ్యూజియంలో ఉన్నాయని విన్నాను. మా లండన్ యాత్రలో అమరావతి శిల్పాలను తిలకించడానికి డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, బోయిపాటి ప్రమోదకుమార్‌లతో కలిసి బ్రిటీష్ మ్యూజియానికి వెళ్లాను.

మొత్తం మ్యూజియమంతా చూడాలంటే ఒకరోజులో పూర్తయ్యే పని కాదు. అందువల్ల ఏకాయెకిన అమరావతి గ్యాలరీకి వెళ్లాము. అద్దాలగదిలో అతి జాగ్రత్తగా అమర్చిన అమరావతి శిల్పాలను చూసి అచ్చెరువు చెందాను.

మ్యూజియంలో వివిధ దేశాల శిల్పులు చెక్కిన శిల్పాలు వందలాదిగా ఉన్నాయి. కానీ వాటిలో తలమానికమైనవి మన అమరావతి శిల్పాలు. బ్రిటీష్ మ్యూజియానికి వన్నె తెచ్చిన మహాశిల్పాలు అవి.

శిల్పరూపంలో సౌందర్యాన్ని పోతపోసి లోకోత్తర కళాసృష్టి చేసిన ఆంధ్ర శిల్పికి జోహార్లు అర్పించకుండా ఉండలేకపోయాను. తెలుగు శిల్పుల ఉలి చెక్కిన శిల్పాలు సృష్టికే అందాలు తెచ్చాయి. వాటిని చూసి తెలుగువాడిగా గర్వపడ్డాను. అంతకుమించి విదేశీయులు ఆ శిల్పాల మనోహరత్వాన్ని తిలకించి, మైమరుస్తుంటే మరింత ఆనందమనిపించింది.

అమరావతి శిల్పాలు నిజంగా రాతిలో కవితలు. మనోహరత్వం, ప్రాణ స్పందనలతో ఎంతో మనోజ్ఞంగా దర్శనమవుతున్నాయి. ధార్మిక విషయాలనే కాక, లౌకిక విషయాలను కూడా శిల్పించడం గమనించాను. దేవతామూర్తులకు బదులు ఈ శిల్పాల్లో మానవుల, జంతువుల, పక్షుల, వృక్ష రూపాలు ఎక్కువ గోచరిస్తాయి. నిత్య జీవితంలోని సామాన్య ఘట్టాలకు రూపం యిచ్చారు. మానవుని నిత్యజీవితంలోని ప్రేమ, సంయోగవియోగాలు, బాధలు, ద్వేషం, వ్యథలు, క్రీడలు, అలంకరణలు తదితరాలేవీ వారి కళాసృష్టి నుంచి తప్పించుకోలేదు.

హీనయాన బౌద్ధ శిల్పులు బుద్ధుని రూపం ఎక్కడా ప్రవేశించకుండా జాగ్రత్త పడ్డారు. ఈ శిల్పాలు బ్రిటీష్ మ్యూజియానికి తరలిపోవడం వెనుక పెద్ద చరిత్రే వుంది. దానిని సంక్షిప్తంగా క్రింద ఇస్తున్నాను. బ్రిటిష్ మ్యూజియంలో ప్రాచ్యదేశాల ప్రాచీన సంపద విభాగానికి డిప్యూటీ కీపర్‌గా పనిచేస్తుండిన శ్రీ రాబర్ట్ నాక్స్ (Robert knox) వ్రాసిన "Amaravati-Buddhist Sculpture from the Great Stupa" గ్రంథం నుంచి ఈ విషయాలు తీసుకోబడ్డాయి.

ప్రస్తుతం గుంటూరు జిల్లాలో కృష్ణానదీ తీరంలో నిస్తేజంగా ఉన్న అమరావతి క్రీస్తు శకం ప్రారంభకాలంనాటికి ప్రపంచ ప్రసిద్ధి చెందిన బౌద్ధ క్షేత్రం, ప్రముఖ వ్యాపార కేంద్రం. శ్రీలంక, చైనా, జపాన్ వంటి దేశాల నుంచి ఎందరో విద్యార్థులు ఇక్కడి విద్యాలయాల్లో అధ్యయనానికి వచ్చేవారు. బౌద్ధమత వినాశనం తరువాత ఈ ప్రాంత ప్రాధాన్యత తగ్గిపోయింది. చారిత్రక శిల్పసంపద భూగర్భంలో ఇమిడిపోయింది. ఒక మహాస్తూపం మాత్రం చెల్లాచెదరై దయనీయంగా పడివున్న శిల్పాలను, శిల్పఖండాలను దీనంగా చూస్తూ, చరిత్రకు మౌనసాక్షిగా ఉండేది.

18వ శతాబ్దం నాటికి ఆ స్తూపం కనుమరుగైంది. స్తూపంలో అమర్చిన అపురూపమైన పాలరాతి శిల్పాలను కాల్చి బూడిద చేసి, సున్నంగా వాడుకునే దౌర్భాగ్య స్థితి దాపురించింది. అమరావతి శిథిలాల గురించి తెలుసుకున్న బ్రిటిష్ అధికారులు మిగిలిన వాటిని సేకరించి, బ్రిటిష్ మ్యూజియానికి తరలించుకుపోయిన వివరాలు ఎంతో ఆసక్తిదాయకంగా ఉన్నాయి.

క్రీ.శ. 1790 నాటికి అమరావతి స్తూపం పూర్తిగా శిథిలమైపోయి, ఒక మట్టి దిబ్బగా మారిపోయింది. విరిగిపోయిన శిల్పావశేషాలు దాని చుట్టూ అక్కడక్కడ పడి వుండేవి. ఆ పరిస్థితిలో అప్పటి స్థానిక సంస్థానాధీశుడు రాజా వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు తన నివాసాన్ని చింతపల్లి నుంచి అమరావతికి మార్చుకుని, 10వ శతాబ్దికి చెందిన అమరేశ్వరాలయం చుట్టుప్రక్కల రాజ ప్రాసాదాన్ని, పట్టణాన్ని నిర్మించడానికి ఉద్యమించాడు. ఈ శివాలయం తెలుగు దేశంలోని అయిదు ప్రసిద్ధ శైవ క్షేత్రాలలో ఒకటి. దురదృష్టవశాత్తు ఈ ప్రదేశానికి దగ్గరలోనే ఉన్న “దీపాల దిన్నె” అనే ప్రాంతంలో లభ్యమవుతున్న బౌద్ధమతానికి సంబంధించిన ప్రాచీన పాలరాతి ఫలకాలు భవన నిర్మాణ సామాగ్రిగా వారికి బాగా అక్కరకు వచ్చాయి. అపురూప శిల్పాలు గల అసంఖ్యాకమైన సున్నపురాతి పలకలు అమరేశ్వరాలయం ప్రక్కనే గల “శివ గంగ” కోనేటి మెట్ల నిర్మాణానికి ఉపయోగించబడ్డాయి. స్థానిక ముస్లింలు భవన నిర్మాణానికి ఈ రాతి పలకలను ఉపయోగించడానికి ముందు, వాటిపై

వున్న శిల్పాలను చెక్కి పలకలను చదును చేశారు. ఆ విధంగా ఈ కట్టడం యొక్క వినాశనం ప్రారంభమైంది.

ప్రాచీన శిల్పాలతో నిండిన ఈ అపురూపమైన నిక్షేపం గురించి విన్న కల్నల్ కోలిన్ మెకంజి ఈ స్థలాన్ని 1797లో సందర్శించారు. ఆ తరువాత ఆయన సర్వేయర్ జనరల్ ఆఫ్ ఇండియాగా పనిచేశారు. ఆనాటికి స్తూపం ఉపరిభాగపు వ్యాసం సుమారు 30 గజాలుగా (27 మీటర్లు) ఉంది. మెకంజీ ఆ సమయంలో కొన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. అయితే, ఆయన తిరిగి అమరావతికి 1816 మార్చిలో కానీ రాలేకపోయారు (దాదాపు 20 సంవత్సరాలు). ఈ మధ్య కాలంలో స్థూపాన్ని రాళ్ల కోసం ధ్వంసం చేయడం జరిగింది. నీళ్ల ట్యాంక్ నిర్మాణానికిగాను స్తూపం ఉపరిభాగాన్ని స్థానిక జమిందారు త్రవ్వించాడు. మెకంజీ అక్కడే ఆరు నెలల పాటు ఉండి, ఈ కట్టడం నిర్మాణాన్ని గురించిన పూర్తి వివరాలను రికార్డు చేయడం, డ్రాయింగులు గీయించడం మొదలైన పనులను తన సిబ్బందికి పురమాయించి, అజమాయిషీ చేశాడు. 1817వ సంవత్సరాంతానికి కానీ ఈ పని పూర్తి కాలేదు. మెకంజీ యొక్క ఈ రెండవ సందర్శనకు సంబంధించిన వివరాలు 1823లో ప్రచురించబడ్డాయి. ఆయన ఈ సందర్భంగా తయారు చేసిన నోటులు, డ్రాయింగులు, ప్లాన్లు లండన్‌లోని ఓరియంటల్ అండ్ ఇండియా ఆఫీసు లైబ్రరీలో భద్రపరచబడ్డాయి.

మెకంజీ ఆ స్థలం నుంచి 11 రాతిపలకలను పెళ్లగించాడు. వాటిని కలకత్తాకు తరలించడం జరిగింది. అందులో రెండింటిని అక్కడి ఇండియన్ మ్యూజియంలో భద్రపరిచి, మిగిలిన తొమ్మిది రాళ్లను 1821లో లండన్‌కు పంపి, వాడెన్ హాల్ స్ట్రీట్‌లోని ఈస్టిండియా కంపెనీ కలెక్షన్స్‌తో పాటు ఉంచడం జరిగింది. మెకంజీ మరికొన్ని రాళ్లను మచిలీపట్నం రేవు నుంచి తరలించాడు. ఆ తరువాత 1835 నాటికి రాబర్ట్ సన్ అనే వ్యక్తి ఇక్కడి నుంచి 33 రాళ్లను తరలించుకుపోయి, క్రొత్తగా నిర్మించిన మార్కెట్ ప్రాంగణంలో అలంకారంగా ఉంచాడు. ఇతని గురించిన వివారలు ఏవీ తెలియడం లేదు. ఆ

తరువాత ఇవి అలగ్జాండర్ అన్న వ్యక్తి హస్తగతమయ్యాయి. ఇతని గురించి కూడా ఏమీ తెలియడం లేదు. ఈయన వాటిని తన ఉద్యానవనంలో పెట్టుకున్నాడు.

1845లో మద్రాసు సివిల్ సర్వీసుకు చెందిన సర్ వాల్టర్ ఇలియట్ అమరావతిని సందర్శించే నాటికి, మహాస్తూపం దిమ్మె పూర్తిగా అంతర్థానమై పోయింది. ఆయన చూసే నాటికి స్తూపాన్ని పూర్తిగా ధ్వంసం చేసి, యథేచ్ఛగా స్తూపం అడుగు భాగాన్ని త్రవ్వి, లభించినంత వరకు రాళ్లను పెకలించి తీసి, కాల్చి సున్నంగా మార్చేశారు. ఒకప్పుడు అక్కడొక మహా కట్టడం ఉండేదని చెప్పడానికి గుర్తులు మాత్రం మిగిలాయి.

ఇదంతా గమనించిన ఇలియట్ ఆ ప్రాంతంలో త్రవ్వకాలకు ఆదేశించాడు. స్తూపానికి వాయవ్య భాగంలో ఇలియట్ త్రవ్వకాలు జరిపించి దాదాపు 79 శిల్పాలను వెలికి తీశాడు. అయితే వాటికి సంబంధించిన వివరాలు ఎక్కడా వెల్లడించబడలేదు. పరిపూర్ణత లేని డ్రాయింగ్‌లు, శిల్పాలను గురించిన చిత్తు ప్రతులు కొన్ని ఇలియట్ త్రవ్వకాలకు సంబంధించినవి బ్రిటిష్ మ్యూజియంలో లభిస్తున్నాయి. ఇలియట్ త్రవ్వకాల తరువాత ఈ ప్రదేశం 1845 నుంచి 1877 మధ్యకాలంలో, స్వెల్ మళ్ళీ త్రవ్వకాలకు పూనుకునే వరకు పూర్తిగా విస్మరించబడింది.

త్రవ్వి తీసిన రాళ్లను మద్రాసుకు తరలించి, మద్రాసు కాలేజి ఆవరణలో అశ్రద్ధగా ఎండవానలకు వదిలి వేశారు. 1853లో వాటి గురించి విచారించిన కోర్టు డైరెక్టర్లు ఈ రాళ్లను సెంట్రల్ మ్యూజియానికి తరలించారు. అప్పటికే ప్రచండభానుడి ప్రతాపానికి గురైన శిల్పాలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. 1856లో ప్రభుత్వ సెంట్రల్ మ్యూజియం సూపరింటెండెంట్ ఎడ్వర్డ్ బల్‌ఫోర్ చొరవతో రెవరెండ్ విలియం టేలర్ వాటికి నంబర్లు ఇచ్చి, కేటలాగులోకి ఎక్కించాడు. టేలర్ జాబితా ప్రకారం ఇవి 79. ఇందులో నుంచి రెండు రాళ్లు పోయాయి. వాటికి మచిలీపట్నం నుంచి తెచ్చిన 37 రాళ్లను కలిపారు. ఎడ్వర్డ్ బల్‌ఫోర్ ఈ రాళ్లను మద్రాసు మ్యూజియంలో తొమ్మిదేళ్లు భద్రపరిచాడు.

వాటిని ఫొటోలు తీయించి డ్రాయింగ్‌లు గీయించి, నంబరింగ్ చేయించాడు. ఈ డ్రాయింగ్‌లు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయో తెలియదు. ఇందుకు సంబంధించి ఏ పత్రమూ ప్రచురింపబడలేదు. ఇలియట్ మార్బుల్స్‌కు ఫొటోలు తీసి, ప్రభుత్వ ఫొటోగ్రాఫర్ కాస్టల్ లిమ్యాట్రైస్ 1858లో ప్రచురించే నాటికి వాటికి మరో ఏడు రాళ్లు చేరి, మొత్తం 111 అయినాయి.

1859 నాటికి ఇవి 121కి చేరాయి. ఆ సంవత్సరం ఎడ్వర్డ్ బల్‌ఫోర్ కోరిక మేరకు, కోర్ట్ ఆఫ్ డైరెక్టర్లు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రభుత్వ ధనంతో వాటిని ఓడలో లండన్‌లోని ఇండియా ఆఫీసుకు తరలించడం జరిగింది. అయితే దురదృష్టవశాత్తు ఫైవ్ హౌస్, వైట్ హాల్ లోని ఇండియా మ్యూజియంలో వాటికి ఒక స్థలాన్ని చూసే వరకు, సంవత్సరం పాటు ఇవి సౌత్ పార్క్‌లోని బాల్స్ వార్ఫ్ ప్రాంగణంలో నిరాదరణకు గురై పడి ఉన్నాయి. ఎండవానలకే కాక, వాయు కాలుష్యానికి కూడా ఇవి గురై దెబ్బ తిన్నాయి. మద్రాసులో ఫొటోలు తీసే నాటికి దాదాపు సురక్షితంగా ఉన్న ఈ రాళ్లు 1880లో బ్రిటిష్ మ్యూజియం వాటిని హస్తగతం చేసుకొనే నాటికి అక్కడి వాతావరణానికి బాగా పాడైపోయాయి.

1867వ సంవత్సరంలో పారిస్‌లో జరిగిన యూనివర్సల్ ఎగ్జిబిషన్‌లో కొన్ని అమరావతి శిల్పాలను భారతీయ వాస్తు శాస్త్రం మీద అధ్యయనం చేస్తున్న చరిత్రకారుడు జేమ్స్ ఫర్గూసన్ చూడటం జరిగింది. ఈ శిల్పాల ప్రాభవం గురించి తనకు కాకతాళీయంగా తెలిసిందని ఫర్గూసన్ ఒక సందర్భంలో చెప్పారు. ఆ తరువాత అమరావతి శిల్పాల ఫొటోలను తన వ్యాఖ్యానంతో ఆయన 1868లో "వృక్ష–సర్పపూజ" అన్న పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించారు. 1873లో దీనికి రెండవ ముద్రణ వచ్చింది. ఈ మధ్యకాలం వరకు అమరావతి శిల్పాల మీద బ్రిటన్‌లో వచ్చిన సాధికారిక ప్రచురణ ఇదే.

ఫైవ్ హౌస్ నుంచి ఈ శిల్పాలను తరలించిన తరువాత వాటిని లాంబెత్‌లో బెల్ వెదర్ రోడ్ లోని "ఇండియా స్టోర్స్"లో 1874 వరకు, సౌత్ కెన్సింగ్టన్‌లోని న్యూ ఇండియా మ్యూజియంలో సౌత్ ఎంట్రెన్స్‌లో వాటిని

ప్రదర్శనకు నిలబెట్టే వరకు, పడేసి ఉంచారు. ఎగ్జిబిషన్ రోడ్‌లోని ఈ భవనంలో 1851కి చెందిన ఈస్టరన్ గాలరీస్ అనే అద్భుత ప్రదర్శనశాల ఉండేది. ఇది ఇండియా ఆఫీసు వారికి అద్దెకు ఇవ్వబడింది. తరువాతి కాలంలో ఇంపీరియల్ ఇన్‌స్టిట్యూట్‌గా పిలవబడిన ఇండియా మ్యూజియం భవనాన్ని 1950లో పడగొట్టి, ఆ స్థానంలో ఇంపీరియల్ కాలేజి భవనాన్ని నిర్మించారు.

ఇండియా మ్యూజియంను రద్దు చేసి, అందులోని వస్తువులను బ్రిటిష్ మ్యూజియంకు కొన్ని, విక్టోరియా – ఆల్బర్ట్ మ్యూజియంకు కొన్నింటిని ఇచ్చే వరకు అమరావతి శిల్పాలు 1879వ సంవత్సరం వరకు ఎగ్జిబిషన్ రోడ్‌లోనే ఉన్నాయి. ఇండియా మ్యూజియంలోని భారతదేశానికి చెందిన పురావస్తు, శిల్ప సంపదను బ్రిటిష్ మ్యూజియానికి, అలంకరణ కళాఖండాలను, వస్త్రాలు, లోహ, దారు కళా ఖండాలను విక్టోరియా – ఆల్బర్ట్ మ్యూజియానికి (వీటికి కొన్ని మినహాయింపులున్నాయి) పంపడమైంది.

ఆ కాలంలో సర్ ఆగస్టస్ ఉల్‌స్టన్ ఫ్రాంక్స్ అనే ఆయన బ్రిటిష్ మ్యూజియంలో బ్రిటిష్ మరియు మధ్య ప్రాచ్య పురావస్తు విభాగానికి కీపర్‌గా ఉండేవాడు. ఈయన పురావస్తు కళాఖండాల సేకరణలోను, వాటిని పరిరక్షించడంలోనూ 19వ శతాబ్దంలోనే సుప్రసిద్ధుడు. ఓల్డ్ ఇండియన్ మ్యూజియం నుంచి అమరావతి శిల్పాలను ఈయన 1880లో సేకరించాడు. ఈ శిల్పాల మీద ఆయన అమితాసక్తిని కనబరిచి, వాటి వైశిష్ట్యాన్ని తెలుసుకోవడానికి ఆ కాలానికి చెందిన సుప్రసిద్ధ పురావస్తు శాస్త్రవేత్తలను సంప్రదించి, గొప్ప పరిశోధన చేశాడు. రాబర్ట్ స్వెల్‌కు సర్ వాల్టర్ ఇలియట్ వ్రాసిన లేఖలో ఈ విషయం ప్రస్తావిస్తూ, "ఫ్రాంక్స్‌కు కళా ఖండాల పట్ల గల నిరుపమానమైన ప్రేమ నన్ను ముగ్ధుణ్ణి చేసింది. వాటి విలువను గ్రహించి ఆ శిల్పాల పట్ల ఆయన తీసుకున్న శ్రద్ధ మూలంగా ఈ అపురూప కళా ఖండాలు మనకు దక్కాయి. ఆయన చేతుల్లో పడటం వాటి అదృష్టం. వాటి ప్రదర్శనం కోసం తగినంత స్థలాన్ని కేటాయించవలసిందిగా నేను ఆయనను అభ్యర్థించాను." బ్రిటిష్ మ్యూజియంలోని ప్రాచీన దక్షిణ, ఆగ్నేయ

భారతదేశపు ప్రాచీన కళాఖండాల విభాగానికి అమరావతి శిల్పాలను మార్చడం మూలంగా ఇతర భారతదేశ, భారత ఉపఖండంలోని శిల్ప సంపదతో వాటిని సరిపోల్చి చూడటానికి అవకాశం ఏర్పడింది. అంతే కాక, భారతదేశ శిల్పశాస్త్ర పరిణామ వికాసాలను, చారిత్రక నేపథ్యాన్ని కూడా అధ్యయనం చేయడానికి ఈ ఏర్పాటు ఎంతగానో ఉపకరిస్తుంది. ఈ ఏర్పాటును చూడగలిగి ఉంటే ఫ్రాంక్స్, ఇలియట్ ఇద్దరూ ఎంతగానో సంతోషించి ఉండేవారు.

1880లో అమరావతి పాలరాళ్లను బ్లూమ్స్ బర్రీకి తెచ్చినపుడు మొదట వాటిని మ్యూజియం యొక్క సమున్నతమైన మెట్లపై ముఖ్యంగా మొదటి అంతస్తు వెనుక గోడకు, ప్రక్క గోడలకు అమర్చడం జరిగింది. కూర్చున్న సింహాలను రెంటినీ మెట్లకు ఇరువైపులా క్రింది భాగంలో ఉంచడం జరిగింది. 1881 నాటికి అన్నింటిలోకి బాగా ఉన్న 69 కళాఖండాలను గోడలకు అమర్చడం జరిగింది. మిగిలినవి రిజర్వులో ఉంచడమైంది. అమరావతి పాలరాళ్లను వాతావరణ ప్రభావం నుంచి, తుంటరి సందర్శకుల ఆకతాయి చేష్టల నుంచీ రక్షించవలసిన అవసరం ఉందని రిపోర్టు చేయగా, ఈ శిల్పాలకు గ్లాస్ ఫ్రేమ్‌లు ఏర్పాటు చేయడం జరిగింది. ఫ్రాంక్స్ ఈ కళా ఖండాలను జేమ్స్ ఫెర్గుసన్ అనే వ్యక్తి తోడ్పాటుతో అమర్చాడు. అయితే ఈ శిల్ప తోరణాలు స్థూపాలకు చెందినవి కావు – ఇవి బౌద్ధ ఆరామాలకు చెందినవి అన్న ఫెర్గుసన్ అభిప్రాయంతో ఫ్రాంక్స్ సరిగానే విభేదించాడు. పూర్వపు ప్రదర్శనకు సంబంధించిన ఫొటోలు ఏవీ లభించకపోవడం దురదృష్టం.

1860లో సేకరించిన ఇండియా మ్యూజియంలోని కళాఖండాల సముదాయానికి సర్ వాల్టర్ ఇలియట్ 1882లో అప్పగించిన మరొక కళా ఖండం చేరింది. ఇది ఒక డోలు ఆకారంలో గల అపురూప శిల్పం. ఫ్రాంక్ అభ్యర్థన మేరకు మరొక కుడ్య చిత్రాల అడ్డ పలక మద్రాసు మ్యూజియం నుంచి 1885లో వచ్చింది. ఈ కళా ఖండాలన్నీ ఇప్పటికీ చెక్కు చెదరక చాలా చక్కని స్థితిలో ఉన్నాయి.

అమరావతి శిథిలాలకు సంబంధించిన మరికొన్ని కళా ఖండాలను సముపార్జించాలన్న కోరిక ఫ్రాంక్స్‌కు కలిగింది. ముఖ్యంగా బ్రిటిష్ మ్యూజియంలో ఉన్న కళా ఖండాల పరంపరలోవి కావాలని ఆయన కోరుకున్నారు. స్వెల్‌కు ఆయన 24 ఫిబ్రవరి 1881లో వ్రాసిన లేఖలో ఇందుకుగాను తన స్వంత డబ్బును కూడా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నానీ, కాబట్టి కళా ఖండాలున్న పాలరాళ్లను కృష్ణా నది కాలువ ద్వారా మదరాసుకు తరలించవలసిందని కోరాడు. అదే చివరకు జరిగింది. ఒక వేళ అన్ని రాళ్లు ఒకేసారి బ్రిటిష్ మ్యూజియానికి తరలించడం మంచిదని నీవు భావిస్తే, ఆ విషయం నాకు వెంటనే తెలియజేసినట్లయితే, ఈ అంశం మ్యూజియం ట్రస్టీల ముందుంచి, వారి అనుమతి పొందుతానని కూడా ఆ లేఖలో ఆయన పేర్కొన్నారు. ఆ పరిస్థితిలో నావికాదళానికి చెందిన ఒక ఓడను ఇందుకోసం నియోగించడం జరుగుతుందని కూడా వ్రాశాడు.

మద్రాసు గవర్నర్‌కు స్వెల్ చేసిన అభ్యర్థన ఆధారంగా ఆయన ఫ్రాంక్‌కు వ్రాసిన లేఖలో పేర్కొన్న ప్రకారం రెండు కళాఖండాలను బ్రిటిష్ మ్యూజియానికి పంపడానికి ఆమోదించబడింది. 19వ శతాబ్దం చివరి భాగంలో చేసిన ఒక చట్టం ద్వారా భారతదేశ ప్రాచీన సాంస్కృతిక సంపదను అక్కడే పరిరక్షించాలనే కట్టుబాటు విధించడం మూలంగా, సిపాయిల తిరుగుబాటు కాలంలో మాదిరిగా ప్రాచీన సాంస్కృతిక సంపదను ఒకేసారి పెళ్లగించి తీసుకుపోయే అవకాశం లేకుండా పోయింది.

అమరావతి శిల్పాలు బ్రిటిష్ మ్యూజియంలో 1880 నుంచి 1940 వరకు అద్దాల ఫ్రేమ్‌ల వెనకాల సురక్షితంగా ఉండి, సందర్శకులకు ఈ ప్రపంచంలోని ఒక భాగానికి సంబంధించిన ప్రాచీన సంస్కృతిని పరిచయం చేస్తూ నిలిచాయి. అవి బ్రిటిష్ సామ్రాజ్యపు వైభవం వెలిగిపోతున్న రోజులు. భారతీయ అద్భుత శిల్ప సంపదను ప్రపంచ ప్రాచీన ప్రఖ్యాత నాగరికతల సరసన సగౌరవంగా నిలిపిన కాలం. అద్భుత భారతీయ ప్రాచీన శిల్ప సంపదను ప్రపంచ పాఠకులకు, మ్యూజియం సందర్శకులకు పరిచయం

చేసిన కీర్తి ఫ్రాంక్స్‌కు, ఫెర్గుసన్‌కు చిరస్థాయిగా నిలిచిపోతుంది.

1939లో యుద్ధం ముంచుకొస్తున్న తరుణంలో అమరావతి శిల్పాలను విడదీసి, ఒక సురక్షిత ప్రదేశంలో భద్రపరచడం జరిగింది. 1951–52 సంవత్సరంలో తిరిగి మ్యూజియంలోని ముందు హాలులో వాయవ్యభాగంలో ప్రస్తుతం గిఫ్ట్ షాపు ఉన్న ప్రదేశంలో ఈ శిల్పాలను అమర్చడం జరిగింది. పైకప్పు, డోలు ఆకారంతో ఉన్న రాళ్లను పశ్చిమపు గోడకు అమర్చి, కుడ్య చిత్రాలున్న పలకలను వాటి ముందు బిగించడం జరిగింది. ఈ పద్ధతి అప్పట్లో వాడులోకి వస్తున్న ప్రదర్శనా విధానానికి అనుగుణమైంది. అయితే ఆ తరువాత ఆ రాళ్ల బరువు దృష్ట్యా, వాటికవిగా అంత బరువును మోయలేవని గ్రహించడం వల్ల, వాటి బరువును ఆపడానికి స్టీల్ ఫ్రేమ్‌లను ఏర్పాటు చేయడం జరిగింది.

1950 నాటికి శిల్పాల ఉపరితలం స్వల్పంగ శిథిలమవుతున్నట్లు గుర్తించడమైంది. లండన్‌లో ఉన్న శిల్పాలను బ్రిటిష్ మ్యూజియం రీసెర్చ్ లాబరేటరీలోను, భారతదేశంలో ఉన్న శిల్పాలకు ప్రభుత్వ కెమిస్ట్ చేతను రసాయన పరీక్షలు నిర్వహించడం జరిగింది. సున్నితమైన, మృదువైన పాలరాళ్లు వాతావరణంలోని వేడి మూలంగాను, ఇతర కాలుష్యాల మూలంగాను దెబ్బతింటున్నట్లు గుర్తించడమైంది. ఈ దురదృష్టకర పరిస్థితి ఈ రాళ్ళను తిరిగి విడదీసి, వాతావరణ కాలుష్యం ఉండని, ఎయిర్ కండిషన్డ్, ఎయిర్ ఫిల్టర్ భూగర్భ మందిరంలో ఉంచడానికి దారి తీసింది. అందువల్ల 1960 నుంచి ఇవి సందర్శనకు నోచుకోలేదు. అప్పుడప్పుడు అతి తక్కువ సంఖ్యలో ప్రముఖ సందర్శకులను, పరిశోధకులను ఈ శిల్పాల అధ్యయనానికిగాను అనుమతించడం జరిగింది.

ఓరియంటల్ గ్యాలరీని కింగ్ ఎడ్వర్డ్ భవనానికి మార్చిన పిమ్మట అమరావతి శిల్పాలను సాధ్యమైనంత వరకు తిరిగి ప్రదర్శనకు ఉంచాలని మ్యూజియం ట్రస్టు నిర్ణయించడమైంది. "అసాహిషింబుల్" అనే జపాన్ వార్తా పత్రిక యాజమాన్యం ఈ ఆలోచనను ఎంతో ఉదారంగా సార్థకం చేసింది.

భారతీయ ప్రాచీన మహోన్నత శిల్ప కళా వారసత్వానికి గుర్తుగా అమరావతి శిల్పాలు మరొకమారు బ్రిటిష్ మ్యూజియంలో సందర్శకులకు కనువిందు చేస్తున్నాయి.

మద్రాసు ప్రభుత్వ మ్యూజియంలో మొదట 1850లో అమర్చబడి, ఆ తరువాత బ్రిటిష్ మ్యూజియానికి తరలింపబడిన ఈ శిల్పాలను మ్యూజియం సూపరింటెండెంట్ ఎడ్వర్డ్ బల్ఫోర్ ఆదేశాల మేరకు కాప్టెన్ ట్రైస్ ఫొటోలు తీయడం జరిగింది. ఈ ఫొటోలను ఏ రకమైన వ్యాఖ్య లేకుండా 1858లో మద్రాసు మ్యూజియంలో ఇలియట్ మారబుల్స్ అన్న పేరుతో ప్రచురించడం జరిగింది. ప్రస్తుతం ఇదొక అపురూపమైన ఆల్బమ్. ఉపరితలం దెబ్బతిన్న శిల్పాలకు సంబంధించిన పూర్తి వివరాలను అధ్యయనం చేయడానికి ఈ ఫొటోలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. ఈ అద్భుత కళాఖండాలను ప్రజా బాహుళ్యానికి పరిచయం చేసిన బల్ఫోర్‌కు, కాప్టెన్ ట్రైస్‌కు మనం సర్వదా ఋణపడి ఉంటాము.

1859లో ఈ శిల్పాలు బ్రిటన్‌కు వచ్చినప్పటి నుంచీ ఇవి రెండు ప్రముఖ ప్రచురణల్లో చోటు చేసుకున్నాయి. మొదటిది జేమ్స్ ఫెర్గుసన్ ప్రకటించిన "వృక్ష-సర్ప ఆరాధన". ఈ బృహత్ ప్రచురణలో సాంచి శిల్పాలను గురించి, అమరావతి శిల్పాలను గురించి విస్తారంగా చర్చించడమైంది. భారతీయ శిల్ప సంపదపై వెలువడ్డ మొట్టమొదటి పరిశోధనాత్మక ప్రచురణ ఇది. ఇండియా ఆఫీసు ఆధీనంలో ఉన్న ఈ కళా ఖండాలకు అద్భుతమైన స్పష్టతతో ఫొటోలను తీసి, ఈ శిల్పాలకు సంబంధించిన అన్ని వివరాలను ఇస్తూ, బౌద్ధ మతం గురించి వివరణ ఇవ్వడం జరిగింది. కళాఖండాలను దేనికదీ విడివిడిగాను, ఏ పలకకు ఆ పలకగా ఫొటోలు తీయడమైంది. అయితే ఎంట్రీ ఫారాల గురించి చెప్పలేదు.

ఫెర్గుసన్ ఈ ఫొటోలను మరింత అద్భుతంగా కూర్చి, పలకలను అందంగా పేర్చి, వివరణాత్మకమైన వ్యాఖ్యానాన్ని వాటికి ఇచ్చారు. ఆయన చేసిన ఈ పని ఆ తరువాత ఎన్నో తరాల వరకు ఎవరూ చేయలేని పనిగా నిలిచిపోయి, బ్రిటిష్ మ్యూజియంలోని కళాఖండాలకు సాధికారికమైన సమాచారంగా ఉండిపోయింది.

బ్రిటిష్ మ్యూజియంలోని అమరావతి శిల్పకళాఖండాలకు సంబంధించిన సమగ్రమైన వివరాలను ఓరియంటల్ యాంటిక్విటీస్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డగ్లాస్ ల్యారట్ 1954లో ప్రచురించారు. ఈయన ప్రచురణ విడివిడిగా ఒక్కొక్క రాతి పలక గురించిన వివరాలతో కూడి ఉంది. ఈ ప్రచురణలో శిల్పాల వివరాలతో పాటు దక్కన్ చరిత్ర, కళాఖండాల సేకరణ చరిత్ర, స్తూపమూ, శిల్పులకు సంబంధించిన వివరాలు సమగ్రంగా ఉన్నాయి. 1942లో మద్రాసులోని కళాఖండాలకు సంబంధించిన వివరాలతో వచ్చిన శివరామమూర్తి ప్రచురణకు ఇది అన్ని విధాలా సోదరతుల్యం.

ప్రాచీన సంస్కృతులుగా భాసిల్లుతున్న ఈజిప్ట్, మెసపొటేనియా, మెడిటేరియన్ నాగరికతలకు సమాన స్థాయిలో అమరావతి శిల్పాలు నిలుస్తాయి. ఈ శిల్పాలను చెక్కిన విధానం ప్రాచీన భారతీయ సాంస్కృతిక సంపదను మాత్రమే కాక ప్రస్తుత భారతీయ జీవన విధానాన్ని అవగాహన చేసుకోవడానికి తోడ్పడుతుంది. సహజ సౌందర్యంతో అలరారుతున్న అమరావతి శిల్పాలు సరిహద్దులను చెరిపివేపి ప్రపంచ ప్రజలందరిని తమ వైపు ఆకర్షింపజేస్తూ, భారతీయ కళా సంస్కృతులను పరిచయం చేస్తూ, ఆంధ్రుల సాంస్కృతిక వారసత్వాన్ని దిగ్దిగంతాలకు పరివ్యాప్తి చేస్తున్నాయి.

అమరావతి శిల్పి స్వతంత్రుడై అటు ప్రకృతిని ఇటు మానవ చిత్తవృత్తిని మనోజ్ఞమైన శైలిలో సృష్టించాడు.

అలంకార శిల్పాలు, రేఖలూ, వలయాలూ, చతురములు ఎన్నో విధాలుగా చిత్రించబడినవి. ఇవికాక తామర తీగలు, పుష్ప గుచ్ఛాలు సాక్షాత్కరిస్తాయి.

మిథున శిల్పాలలో – స్త్రీ పురుషులు అనేక భంగిమలలో బహు విధములైన శృంగార చేష్టలలో నిమగ్నులయి ఉంటారు. ఆంధ్ర శిల్పుల ఉలి శృంగార రస చిత్రీకరణలో మహా కావ్యాలను తలదన్నినట్లు తోస్తుంది.

శిల్ప రూపంలో పోతపోసి లోకోత్తర కళాసృష్టి చేశాడు నాటి ఆంధ్ర శిల్పి. బ్రిటిష్ మ్యూజియంలోని అపురూప శిల్పాలలో కొన్నిటిని ఇక్కడ పరిచయం చేస్తాను.

## బుద్ధుని జీవితంలో ఒక దృశ్యాన్ని సూచించే సున్నపురాతి స్థంభం

క్రీ.శ. మూడవ శతాబ్దికి చెందిన ఈ కళాఖండం అమరావతి బృహత్ స్తూపం చుట్టూ ఉన్న ప్రాకారం నుంచి సేకరించబడింది.

బుద్ధుని సోదరుడైన సుందరానందుడు (నందుడు) బౌద్ధమతాన్ని స్వీకరిస్తున్న దృశ్యం ఈ శిల్పంలో అద్భుతంగా మలచబడింది.

రెండవ దృశ్యంలో బుద్ధుడు సుందరానందునికి సన్యాసం ఇస్తాడు. ఈ సందర్భంలో అతడు బుద్ధుని ముందు మోకరిల్లి, ఆయన అనుగ్రహం కోసం తలయెత్తి పైకి చూస్తుండగా, బుద్ధుడు సుందరానందునిపై కారుణ్య దృక్కులను వర్షిస్తుంటాడు.

## బుద్ధుని అవశేషాల అర్చన

అమరావతి మహాస్తూపం వేదిక నుంచి ఇది గ్రహించబడింది. ఇటువంటి దృశ్యాలను సాధారణంగా స్తూప పార్శ్వాలలో అమరుస్తారు.

ఈ శిల్పంలో బుద్ధుని అవశేషాలను ఒక ఆసనం మీద ఉంచి, అక్కడ బుద్ధుడు సజీవంగా ఆసీనుడైనట్లుగా భావించి, పూజించడం గమనించవచ్చు. నిజానికి బుద్ధుడు ఈ అవశేషాల ఆరాధనకు వ్యతిరేకం.

## రాకుమారుడు సిద్ధార్థుని జన్మ వృత్తాంతం చిత్రీకరించబడివున్న సున్నపురాతి పలక

క్రీ.శ. 2వ శతాబ్దికి చెందిన ఈ సున్నపురాతి పలక అమరావతి బృహత్ స్తూపం నుంచి సేకరించబడింది. అప్పుడప్పుడే భారతదేశంలో వ్యాప్తిలోకి వస్తున్న బౌద్ధమతానికి ప్రతీకగా ఈ అద్భుత శిల్పాన్ని భావించవచ్చు. అమరావతికి చెందిన అత్యంత సుందర శిల్పాలలో ఒకటైన ఈ పలకలో సిద్ధార్థుని జన్మ వృత్తాంతానికి సంబంధించిన నాలుగు ఇతివృత్తాలను గమనించవచ్చు.



బుద్ధుని అవశేషాల అర్చన

## ఒక చక్రవర్తి చిత్రీకరించబడిన శిల్పం

ఈ శిల్పంలో ఒక చక్రవర్తి అంజలి ముద్రతో నిలబడి వుండటం గమనించవచ్చు. ఆయనకు ఇరువైపుల ఇద్దరిద్దరు చొప్పున నలుగురు సేవకులు - ముగ్గురు స్త్రీలు, ఒక పురుషుడు, తమ కుడి చేతుల్లో వింజామరలను ధరించి ఉన్నారు.

## సిద్ధార్థుని మహాభినిష్క్రమణ దృశ్యాన్ని చిత్రీకరించిన సున్నపురాతి కుడ్యం

ఈ అమూల్య శిల్పం యువరాజు సిద్ధార్థుడు కపిలవస్తులోని తన భవనం వదిలి, తాత్త్విక జిజ్ఞాసతో నిష్క్రమించి, బుద్ధుడుగా మారటం వివరిస్తుంది. అతను ప్రత్యక్షంగా కన్పించకపోయినా, బుద్ధుని ప్రతీకగా గుర్రం మీద ఛత్రంతో బాటు రాజభవన తోరణ ద్వారం దాటుతున్న కంటకాశ్వం కన్పిస్తాయి.

ఇటువంటి సంప్రదాయిక తోరణాలు ఆ రోజుల్లో ప్రవేశ ద్వారాలుగా ఉండేవి. ఇవి దారు నిర్మితాలయి ఉండవచ్చు. ఈ విధానం బౌద్ధ స్తూపాలలో చాలా చోట్ల కన్పిస్తుంది. ఇప్పటికీ కనిపిస్తున్న స్తూపాల తోరణల ద్వారాలు కూడా ఇదే విధంగా కట్టబడి ఉన్నాయి.

## బుద్ధ పాదాలు చిత్రీకరించబడిన శిల్పాలు


ఇది క్రీ.శ. 1వ శతాబ్దికి చెందింది. ప్రారంభ బౌద్ధ శిల్పాలలో బుద్ధుడిని మానవాకారంలో చూపలేదు. ఆయనను ఏదో ఒక చిహ్నం ద్వారా సూచించేవారు. అమరావతికి చెందిన ఈ శిల్పంలో బుద్ధుని పాదాలు చూపడం ఆ విధానంలో భాగమే.

## బుద్ధుని జ్ఞానోదయం, మహాస్థూపం


ఈ స్తూపానికి రెండు వైపులా వివిధ కాలాలలోని చెక్కడాలున్నాయి. సుమారుగా క్రీస్తు పూర్వం 1వ శతాబ్దికి చెందినది మొదటి చెక్కడం. బుద్ధునికి జ్ఞానోదయమైన పిమ్మట ఆ ప్రదేశంలో ఒక పురుష బృందం అతని బోధనలు వినే దృశ్యం దీనిలో ఉంది. స్తూపం రెండవ వైపు క్రీస్తు శకం 3వ శతాబ్దం



బుద్ధుని జీవితంలో ఒక దృశ్యాన్ని సూచించే సున్నపురాతి స్థంభం



ఒక చక్రవర్తి చిత్రీకరించబడిన శిల్పం





బుద్ధ పాదాలు చిత్రీకరించబడిన శిల్పాలు




సున్నపురాతి స్థంభ భాగం

కాలంలో బాగా వివరంగా చెక్కబడినట్టిది. బోధి వృక్షం క్రింద ఖాళీ సింహాసనం బుద్ధుని జ్ఞానోదయాన్ని సూచిస్తుంది.

## సున్నపురాతి స్థంభ భాగం

దీని నాలుగు వైపులా శిల్పాలు చెక్కబడి ఉన్నాయి. ఇది బౌద్ధమత ప్రారంభ కాలానికి చెందినదిగా గుర్తించబడింది. ఇందులో మూడు ప్రక్కల పద్మాలు చెక్కబడి ఉన్నాయి. నాలుగవ వైపు మరింత సున్నితమైన పనితనంతో ఉండి, పూర్ణ ఘటమూ, యక్షిణి ముఖం కనిపిస్తున్నాయి.

అమరావతి శిల్ప వైభవాన్ని మించింది మరేదీ లేదు. మన ఆంధ్ర శిల్పి కళానైపుణ్యం జగజ్జేగీయమానంగా అమరావతి శిల్పాలలో దర్శనమిస్తుంది. ఆంధ్ర శిల్పికి జేజేలు.



# మన కొల్లూరు - కోహినూర్ వజ్రం



థేమ్స్ నది ఒడ్డున వున్న ఒక ప్రాచీనమైన కోట 'టవర్ ఆఫ్ లండన్'. మధ్యయుగంలో రాజప్రాసాదంగా విరాజిల్లి 15 ఎకరాలలో నేడు ప్రపంచ ప్రసిద్ధ పురావస్తుశాలగా వాసిగాంచిన కట్టడమిది. లండన్ టవర్‌లో కోహినూర్ వజ్రాన్ని తిలకించడం ఒక మధురానుభూతి. తెలుగునాట దొరికి, వజ్ర సంపదలో తలమానికంగా పేర్కొనబడే కోహినూర్ వజ్రం భారతదేశానికి గర్వకారణం. మహాభారత కాలం నాటి శమంతకమణి ఇదేనని కొందరు భావిస్తున్నారు. చిత్ర విచిత్రమైన చరిత్ర ఈ కోహినూర్ వజ్రాన్ని ఆవహించి ఉంది. ప్రముఖ పరిశోధకులు శ్రీ దిగవల్లి శివరావుగారు తమ "కథలు–గాథలు" 2వ భాగంలో కోహినూరు వజ్రం గురించి అనేక విశేషాలు వ్రాశారు. లండన్ టవర్‌లో కోహినూరు వజ్రాన్ని చూడగానే అవన్నీ నాకు గుర్తుకు వచ్చాయి. తిరిగి వచ్చిన తరువాత ఆసక్తి మరింత పెరిగి, కోహినూరు వజ్రానికి సంబంధించిన వివరాల్లోకి వెళితే సంభ్రమాశ్చర్యాలను కలిగించే ఎన్నో విశేషాలు తెలిశాయి.

కోహినూరు (Koh-I-Noor) అనగా "తేజః పర్వతం" అని అర్థం. ఇది పర్షియన్ పదం. ఒక మహాపర్వతమంత కాంతిని ప్రసరింపజేయగల

దివ్యరత్నమిది. ఈ వజ్రం యొక్క ప్రభావానికి సమ్మోహితులైన ఎందరో రాజన్యులు, చక్రవర్తులు దీనిని స్వంతం చేసుకోవడానికి తహతహలాడారు. ఈ వజ్రం కోసం యుద్ధాలు చెలరేగి, రక్తపాతం జరిగింది. బంధుత్వాలు, రక్త సంబంధాలు మరచి ఒకరినొకరు మోసం చేసుకున్నారు. హత్యలు చేశారు. తీవ్రమైన హింసలకు గురయ్యారు. దీన్ని రక్షించుకోవడానికి పడ్డ తపనలో ఎంతో మానసిక వేదన అనుభవించారు. శతాబ్దాల తరబడి చేతులు మారుతూ, ఈ వజ్రం చేసిన బహుదూర ప్రయాణం ఎంతో ఉద్విగ్నభరితం. ఈ వజ్రం చుట్టూ ఎన్నో చరిత్రలు తిరిగాయి. కథలూ, గాథలూ, కల్పనలూ అల్లుకున్నాయి. ప్రపంచంలో ఏ వజ్రానికి దక్కని ప్రత్యేకతను స్వంతం చేసుకున్న ఈ అనర్ఘరత్నం జన్మస్థానం ఆంధ్రదేశం!

ఈ వజ్రం గుంటూరు సీమలోని సత్తెనపల్లి తాలూకా కొల్లూరు గ్రామంలోని ఒక వజ్రపుగనిలో దొరికిందని అబ్దుల్ అజీజ్‌గారు "Journal of Indian Hisotry" అనే చారిత్ర విషయిక పత్రికలో వ్రాసిన వ్యాసం కలకత్తాలో మోడరన్ రివ్యూలో ప్రకటించబడింది. ఈ వ్యాసాన్ని 1938లో భారతి మాసపత్రిక – సంపుటం–10లో అనువదించి ప్రచురించారు.

ఈ వజ్రం ఐదువేల సంవత్సరాల నాటిదని భారతదేశ సంప్రదాయ చరిత్రలో ప్రచారం ఉన్నమాట వాస్తవమని, అయితే ఇందుకు సంబంధించిన ఆధారాలు లభ్యం కావడం లేదనీ పాశ్చాత్య చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. లభిస్తున్న చారిత్రకాధారాల ప్రకారం ఈ వజ్రం ప్రస్తావన మొగల్ చక్రవర్తి బాబర్ తన జ్ఞాపకాలను 'బాబర్ నామా' పేరుతో వ్రాసుకున్న గ్రంథంలో ఉంది. బాబర్‌నామాలో ఈ విధంగా ఉంది. క్రీ.శ. 1300ల ప్రాంతంలో మాళవ (ప్రస్తుత గుజరాత్) రాజవంశం చాలా బలంగా ఉంది. నర్మదా నదికి వింధ్యపర్వతానికి మధ్యగల భూభాగాన్ని అప్పటికి వెయ్యి సంవత్సరాల బట్టీ వీరు పాలిస్తున్నారు. వీరు మహ్మదీయులకు గట్టి ప్రతిఘటన ఇచ్చారు. అయితే 1295 నుంచి 1316 వరకు ఢిల్లీని పాలించిన అల్లావుద్దీన్ ఖిల్జీ తాను రాజ్యపాలనకు రావడానికి ఒక సంవత్సరం ముందు దక్కన్‌పై దండయాత్ర చేసి, నర్మద, తుంగభద్ర, కృష్ణా నదుల మధ్యభాగాన్ని

మాళవరాజు నుంచి కైవసం చేసుకున్నాడు. ఆ సందర్భంలో మాళవరాజ్యం నుంచి కొల్లగొట్టిన అపార ధనరాసుల్లో ఈ వజ్రం కూడా ఉంది. యువరాజుగా వుండిన అల్లావుద్దీన్ 1295లో తన పినతండ్రి అయిన ఢిల్లీ సుల్తాన్ జలాలుద్దీన్‌ను దారుణంగా హత్యచేసి, ఢిల్లీ సింహాసనం ఆక్రమించుకున్నాడు. ఆ తరువాత మాళవ రాజుల నుంచి గుజరాత్‌ను కూడా తన వశం చేసుకుని అక్కడి ధనరాసుల్ని ఢిల్లీకి తరలించాడు. ఒక వాదన అల్లావుద్దీన్ ఈ వజ్రాన్ని దక్కన్‌లో హస్తగతం చేసుకున్నాడని వుండగా, మరొక వాదన దీనిని గుజరాత్‌లో మాళవరాజుల నుంచి చేజిక్కించుకున్నాడని వినిపిస్తున్నది.

ఆ తరువాత 200ల సంవత్సరాలకు 1526లో పానిపట్టు యుద్ధంలో బాబర్ అప్పటి ఢిల్లీ సుల్తాన్ ఇబ్రహీంలోఢీని సంహరించి, ఢిల్లీని ఆక్రమించుకున్నాడు. ఈ యుద్ధంలో ఇబ్రహీంలోఢీ పక్షాన పోరాడిన గ్వాలియర్ రాజు విక్రమాదిత్య కూడా హతుడైనాడు. ఈయన ఆగ్రా కోటకు రక్షకుడు కూడాను. కాబట్టి యుద్ధానికి వెళ్ళేముందు విక్రమాదిత్య తన సమస్త సంపదను భద్రత కోసం ఆగ్రా కోటకు తరలించాడు. అందులో ఈ అమూల్య వజ్రం కూడా వుంది. బహుశః అల్లావుద్దీన్ తాను దోచుకుతెచ్చిన ఈ వజ్రాన్ని విక్రమాదిత్య పూర్వీకులకు, వారు తన పట్ల చూపిన విశ్వాసానికి గుర్తింపుగా, గ్వాలియర్‌తోపాటు ఇచ్చివుంటాడు.

ఢిల్లీని ఆక్రమించుకున్న తరువాత బాబర్ ఆగ్రాకు 1526 మే 4వ తేదీన వెళ్లాడు. అక్కడ బాబర్‌కు లభించిన అపార సంపదలో ఈ వజ్రం కూడా ఉంది. ఆ విధంగా ఈ వజ్రం మొగలాయీల వశమైంది. అయితే, బాబర్‌నామా ఈ సంఘటనను మరో విధంగా చెబుతున్నది. అది :

“బాబర్ కుమారుడు హుమాయూన్ ఆగ్రాకు వచ్చినపుడు, విక్రమాదిత్య అంతఃపుర పరివారం పారిపోవడానికి ప్రయత్నించారు. అయితే హుమాయూన్ సైన్యం వారిని చుట్టుముట్టి కదలనీయలేదు. హుమాయూన్ వారిని దోచుకోవడానికి తన సైన్యాన్ని అనుమతించలేదు. వారు ఇష్టపూర్వకంగా అనర్ఘరత్నాలు, ఆభరణాలు వున్న ఒక పేటికను హుమాయున్‌కు

బహూకరించారు. అందులో సుల్తాన్ అల్లావుద్దీన్ మాళవరాజు నుంచి దోచుకొచ్చిన ఈ ప్రఖ్యాత వజ్రం కూడా వుంది. ఇది ఎంత విలువైందంటే – దీనిని పరిశీలించిన వజ్రాల నిపుణుడొకడు ప్రపంచం మొత్తం ఒక రోజులో చేసే ఖర్చులో సగం వుంటుంది దీని విలువ అని పేర్కొన్నాడు. హుమాయూన్ ఆగ్రా నుంచి తెచ్చిన సంపదతో పాటు ఈ అమూల్య రత్నాన్ని నాకు సమర్పించుకున్నాడు. అయితే, ఈ రత్నాన్ని అతనికి బహుమతిగా తిరిగి ఇచ్చివేశాను".

ఇంకొక కథనం ప్రకారం ఇబ్రహీంలోఢి తల్లి స్వయంగా ఈ వజ్రాన్ని హుమాయూన్ పరం చేసింది. ఆగ్రా కోట మొగలాయిల వశమైనపుడు ఇబ్రహీంలోఢి అంతఃపుర స్త్రీలు, విక్రమాదిత్య అంతఃపుర స్త్రీలు ఒక భవనంలో తలదాచుకున్నారు. ఖజానా గురించిన సమాచారం కోటలో ఎవరూ ఇవ్వలేదు. చివరికి ఒక పరిచారిక ఆ భవనంవైపు చూపింది. హుమాయూన్ తన బలగాలతో, ఆ భవనంలో ప్రవేశించగా, విక్రమాదిత్య కుటుంబానికి చెందిన స్త్రీలు భయకంపితులై పెద్ద పెట్టున రోదించడం మొదలు పెట్టారు. అప్పుడు హుమాయూన్ వారి గౌరవానికి ఏ రకమైన భంగం వాటిల్లదని హామీ యివ్వగా అల్లావుద్దీన్ తల్లి ఒక గదిలో నుంచి వణుకుతున్న చేతులతో ఒక బంగారు మందసాన్ని తెచ్చి హుమాయూన్ చేతుల్లో పెట్టింది. అందులో మిగతా ఆభరణాలతో పాటు ఈ వజ్రం కూడా వుంది. అయితే ఈ కథనాన్ని ఎవరూ నమ్మడం లేదు.

ఏది ఏమైనప్పటికీ ఈ వజ్రం ఆగ్రా కోట నుంచి మొగల్ చక్రవర్తుల చేతుల్లోకి మారిందన్నది మాత్రం సత్యం. బాబర్ కథనం ప్రకారం అప్పట్లో దీని బరువు సుమారు 8 మిస్కాలు. దీన్ని లెక్కించిన చాలామంది ఇది 186 (పాత) క్యారట్ల బరువుందని వ్రాశారు.

బాబర్ పానిపట్టు యుద్ధంలో ఘన విజయం సాధించిన నాలుగు సంవత్సరాలకు హుమాయూన్ జబ్బు పడ్డాడు. ఈ జబ్బు నివారణకు

వైద్యులేమీ చేయలేకపోయారు. జబ్బు మరింత ముదిరింది. అప్పుడొకరు హుమాయూన్ ప్రాణాలు కాపాడ్డానికిగాను బాబరు తనవద్దనున్న అమూల్య వస్తువును వదులుకోవలసి వుంటుందని సూచించాడు. తన కుమారుడి ప్రాణాలకోసం బాబరు ఈ వజ్రాన్ని తప్పక త్యాగం చేస్తాడని, ఈ అవకాశాన్ని జారవిడుచుకోరాదని అతని ఉద్దేశం. అయితే, అతని అంచనా తప్పింది. ఈ వజ్రాన్ని వదులుకోవడానికి బాబరు ఇష్టపడలేదు. తన వద్ద నున్న అమూల్య వస్తువు తన ప్రాణాలేనని తెలియజేసి, జబ్బుపడివున్న హుమాయూన్ మంచం చుట్టూ తిరుగుతూ, హుమాయూన్‌ను రక్షించి, అందుకు ప్రతిగా తన ప్రాణాలు తీసుకోమని బాబరు భగవంతుణ్ణి ప్రార్థించాడట. ఆ తరువాత హుమాయూన్ పరిస్థితి క్రమంగా మెరుగుపడిందనీ, దానితోపాటు బాబరు ఆరోగ్యం క్షీణించడం ప్రారంభమై, చివరకు ఆయన 1530 డిసెంబర్‌లో చనిపోయాడనీ చెబుతారు.

హుమాయూన్ పరిపాలన 26 ఏళ్ళపాటు సాగింది. అయితే మధ్యలో ఎన్నో అవాంతరాలు. తొమ్మిదిన్నర సంవత్సరాల మొదటి పాలన తరువాత షేర్‌ఖాన్ ఆఫ్ఘన్ సైన్యంతో ఇతనిని భారతదేశం నుంచి తరిమేశాడు. హుమాయూన్ మొదట సింధుకు వెళ్ళి, అటుపిమ్మట పర్షియా చేరుకుని 15 సంవత్సరాల వరకు భారత్‌కు తిరిగి రాలేదు. తిరిగి అధికారం చేజిక్కించుకున్న తరువాత ఆయన పాలన ఆరు మాసాలకు మించి సాగలేదు. ఒక రోజు మసీదు నుంచి ప్రార్థనకు పిలుపువిని, ఒక్క ఉదుటున లేచి, తన గ్రంథాలయం మెట్ల మీద నుంచి, బహుశః నల్లమందు ప్రభావంతో, తలక్రిందులుగా పడిపోయి, చనిపోయాడు.

ఆఫ్ఘనుల చేతిలో రాజ్యభ్రష్టుడై దేశం వెలుపల తిరుగుతుండిన కాలంలో హుమాయూన్ తన తండ్రి ఆగ్రాలో తనకు తిరిగి ఇచ్చిన ఈ అమూల్య వజ్రాన్ని మాత్రం తనతోనే ఉంచుకున్నట్లు చారిత్రకాధారాలున్నాయి. అప్పట్లో రెండువందల సంవత్సరాల పాటు ఈ వజ్రం "బాబరు వజ్రంగా" పిలవబడేది. రాజ్యాన్ని, ఒక్కగానొక్క ముద్దుల కుమార్తెను, అసంఖ్యాకంగా వున్న భార్యలను,

ఆఖరికి తన ఆశాదీపం, వంశాంకురం అయిన తన కుమారుడు అక్బర్‌ను కూడా వదులుకుని 20 సంవత్సరాలు గడపగలిగాడు కాని, ఆయన ఈ వజ్రం నుంచి మాత్రం ఎడబాటు పొందలేదు. ఆయనకు ఈ వజ్రంపైగల వ్యామోహానికి ఈ ఒక్క సంఘటన చాలు. ఆయనకు ఆశ్రయం యిస్తున్న రాజ్యాధినేత ఈయన అశక్తతను సాకుగా తీసుకుని తనకు నమ్మకస్థుడైన ఒక వ్యక్తిని వజ్రాల వ్యాపారిగా హుమాయూన్ వద్దకు పంపాడు. అతడు తన వద్దనున్న వజ్రాన్ని కొనడానికి వచ్చాడని తెలుసుకొని హుమాయూన్ కోపోద్రిక్తుడై, "అటువంటి అమూల్య వజ్రాలను ఎవరూ కొనలేరు. వాటిని భగవదనుగ్రహం వల్ల లభించిన పరాక్రమంతో ఖడ్గ ప్రహరణ ద్వారా గెలుచుకోవాలి లేదా ఒక మహారాజు అనుగ్రహించి కానుకగా ఇవ్వాలి" అని చెప్పి ఆ వ్యక్తిని త్రిప్పి పంపాడు.

హుమాయూన్ రాజ్యభ్రష్టుడుగా తిరుగుతూ చివరకు పర్షియా చేరుకున్నాడు. పర్షియా రాజు షాతహమస్ ఈ మొగలాయి చక్రవర్తిని ఎంతో గౌరవాదరాలతో ఆహ్వానించి, ఆశ్రయమిచ్చాడు. షా తహమస్ ఆతిథ్యానికి ఉప్పొంగిపోయిన హుమాయూన్ ఆయనకు ఎన్నో అమూల్య రత్నాలను కానుకగా ఇచ్చాడు. అందులో "బాబరు వజ్రం" కూడా ఒకటని, అప్పట్లో ప్రముఖ చరిత్రకారుడు అబ్దుల్ ఫజల్ వ్రాశాడు. ఈయన తదనంతర కాలంలో హుమాయూన్ కుమారుడు అక్బర్ షాదూషాకు కార్యదర్శిగా పనిచేసాడు. ఈయన వ్రాసిన "అక్బర్‌నామా"లో ఈ విషయం పేర్కొంటూ, ఈ వజ్రం ప్రపంచంలోని ఎన్నో దేశాల ఆదాయానికి సమానమని శ్లాఘించాడు. హుమాయూన్ తనకు సమర్పించుకున్న రత్న సంపదను చూసి సంభ్రమాశ్చర్యాలకు లోనైన పర్షియారాజు, రత్న నిపుణులను రావించి వాటి విలువను మదింపు వేయమని కోరాడు. వాటిని పరిశీలించిన రత్న నిపుణులు, ఆ రత్నాలకు విలువ కట్టడం సాధ్యం కాని పని అని, అన్ని రత్నాలలోకి బాబరు వజ్రం తలమానికమని చెప్పారు. "ప్రపంచపు ఒకరోజు ఖర్చుతో సమానమైనదని చెప్పటం తప్ప 'దీని విలువ ఇంత' అని ఈ వజ్రానికి

ఏకాలంలోను విలువ కట్టలేకపోయారు.

హుమాయూన్ ఈ వజ్రాన్ని పర్షియా రాజుకు కానుకగా ఇవ్వడాన్ని అప్పుడు పర్షియా రాజు దర్బారులో వున్న గోల్కొండ నవాబు కులీకుతుబ్‌షా రాయబారి ఖూర్‌షా ధ్రువీకరించాడు. దీని బరువు 6 మిస్కాలు ఉందనీ, మొత్తం ప్రపంచం చేసే రెండున్నర రోజుల ఖర్చుకు ఇది సమానమని ఆయన చెప్పాడు. అయితే, పర్షియారాజు షా తహమస్ దీనిని అంతగా నమ్మలేదని, ఆ తరువాత దీనిని భారత్‌లో తన మిత్రుడు అహ్మద్‌నగర్ రాజైన బర్హాన్ నిజాంకు కానుకగా తనకు నమ్మకస్తుడైన మెహతర్ జమాల్ అనే వ్యక్తితో పంపాడని, అయితే ఈ వ్యక్తి ఆ కానుకను అందజేయక నమ్మకాన్ని వమ్ము చేసినందున అతనిని పర్షియారాజు అరెస్టు చేయించాడని ఖూర్‌షా వ్రాశాడు. ఆ విధంగా ఈ వజ్రం తిరిగి భారత్ చేరుకుని, ఎన్నో చేతులు మారింది. ఈ సంఘటన 1547లో జరిగింది. 1650లో పాలన చేస్తున్న మొగలాయి చక్రవర్తి షాజహాన్ తన మూడవ కుమారుడు ఔరంగజేబును దక్కన్‌కు గవర్నర్‌గా వేశాడు. ఔరంగజేబు సామ్రాజ్యవాది. దక్కన్‌లోని రాజ్యాలను కబళించడానికి పథకాలు వేసేవాడు. ముఖ్యంగా అపారమైన వజ్రాల గనులున్న గోల్కొండ రాజ్యం మీద తన దృష్టిని కేంద్రీకరించాడు.

ఆ కాలంలో గోల్కొండ రాజ్యంలో ప్రధాన మంత్రిగా పనిచేసిన మీర్ జుమ్లా గొప్ప రత్నాల వర్తకుడు. పర్షియా రాజ్యంలో మంచి పేరు ప్రతిష్టలున్న ఈయన చేతుల్లోనే గోల్కొండ రాజ్యపు వజ్రాల వ్యాపారం వుండేది. ఈయన గోల్కొండ రాజ్యంలోని విస్తారమైన గనుల నుంచి అపార రత్నరాసులను ప్రోది చేసుకోవడమేగాక రాజమాతతో అక్రమ సంబంధం పెట్టుకొని దొరికిపోయాడు. అందువల్ల ప్రాణభయంతో గోల్కొండ నుంచి పారిపోయి, మీర్ జుమ్లా, దక్కన్ గవర్నర్‌గా పనిచేస్తున్న ఔరంగజేబును 1656లో కలిశాడు. ఆ తరువాత ఢిల్లీకి వెళ్ళి, ఔరంగజేబు తండ్రి షాజహానును కలిశాడు. ఇతను తండ్రీ కొడుకు లిద్దరికీ అమూల్యమైన రత్న సంపదను

బహూకరించాడు. అందులో "బాబరు వజ్రం" కూడా ఒకటని అంటారు. ఈస్టిండియా కంపెనీ ఏజెంటు ఒకరు మీర్ జుమ్లా 160 రతులున్న అమూల్య వజ్రాన్ని షాజహానుకు  కానుకగా ఇచ్చాడని వ్రాశాడు.

మరొక అభిప్రాయం ప్రకారం గోల్కొండ మంత్రిగా ఉండి స్వతంత్ర ప్రభువైన మీర్ జుమ్లా ఔరంగజేబుకు స్నేహితుడైనాడు. ఈ మీర్ జుమ్లా ఆహ్వానం మీదే ఔరంగజేబు దక్షిణ దిగ్విజయ యాత్రను చేపట్టి కృతకృత్యుడైనాడు. ఔరంగజేబు చక్రవర్తికి మీర్ జుమ్లా, నమ్మినబంటుగా వుండి, ఆయనకు సేనాధిపతిగా, రాజప్రతినిధిగా చరిత్రపుటలకెక్కాడు. అహ్మద్‌నగర్ నవాబు నుంచి ఈ బాబరు వజ్రాన్ని మీర్ జుమ్లా చేజిక్కించుకుని, మెప్పు కోసం ఔరంగజేబుకు కానుకగా ఇచ్చాడు.

క్రీ.శ. 1636-1662 మధ్య ఆరుసార్లు తూర్పుదేశాలలో సంచరించిన టెవర్నియర్ అనే ఫ్రెంచి వర్తకుడు ఈ విషయం వ్రాస్తూ సానబట్టని స్థితిలో 900 రతులు లేక 787 క్యారట్లు తూనికగల ఒక గొప్ప వజ్రం కొల్లూరులో దొరికిందని, దానిని మీర్ జుమ్లా 1656-57 మధ్య షాజహాను చక్రవర్తికి సమర్పించాడని పేర్కొన్నాడు.

1707లో ఔరంగజేబు చక్రవర్తి చనిపోయే నాటికి మొగలాయి సామ్రాజ్యం మహోన్నత స్థితిలో ఉంది. షాజహాను చేయించిన అమూల్యమైన మయూర సింహాసనంతో పాటు, రత్నఖచితమైన ఇంకా తొమ్మిది సింహాసనాలు, అమూల్యమైన రత్నరాసులు, ధనకనక వస్తు వాహనాలతో పాటు అపూర్వమైన బాబరు వజ్రం ఖజానాలో వున్నాయి.

ఔరంగజేబు తదనంతర మొగలు చక్రవర్తులు బలహీనులు, భోగలాలసులు. అందువల్ల సామ్రాజ్య ప్రాభవం సన్నగిల్లడం ప్రారంభమైంది. 13 సంవత్సరాలలో ఆరుగురు పాలకులు మారారు. అందరూ అసహజ మరణాలకు గురైనవారే. చక్రవర్తులు బలహీనులు కావడంతో సామ్రాజ్యం

కూడా బలహీనమైపోయింది. ఈ భోగభాగ్యాలను దోచుకోవాలనే దురాశ చుట్టుప్రక్కల రాజులకు, విదేశీయులకు కలిగింది. 1736లో పర్షియా రాజైన నాదిర్‌షా, 1739లో భారతదేశం మీదికి దండెత్తి వచ్చాడు. అప్పటి మొగల్ చక్రవర్తి మహ్మద్‌షా 1719లో సింహాసనాన్ని అధిష్టించాడు. ఎల్లప్పుడూ అతని బాహువులలో మగువ, చేతిలో మధుపాత్ర వుండవలసిందేనట. నాదిర్‌షాతో కర్నాల్‌లో జరిగిన రెండుగంటల యుద్ధంలోనే అపారమైన మొగలాయి సైన్యం చెల్లాచెదరైపోయింది. 20 వేల మందికి పైగా సైన్యం హతులైనారు. అంతకంటే పెద్ద సంఖ్యలో బందీలైనారు. నాదిర్‌షా సరాసరి ఢిల్లీ కోటలో చొరబడి, అక్కడి సంపదనంతా తన వశం చేసుకున్నాడు. అతడి సైనికులు ఢిల్లీ నగరం మీద పడి దోచుకున్నారు. మొగల్ చక్రవర్తికి నాదిర్‌షాను మంచి చేసుకుని అతనికి ఆతిథ్యమివ్వక తప్పలేదు.

నాదిర్షా హస్తగతం చేసుకున్న సంపద విలువ ఇంత అని చెప్ప వీలు లేదు. ఇది 70 కోట్ల నవరసులుంటుందని ఫ్రెజర్ అనే అతను వ్రాశాడు. నగలే 25 కోట్ల విలువ గలవి. రత్న ఖచిత మయూర సింహాసనం, ఇంకా తొమ్మిది సింహాసనాలు, వెండి, బంగారు, రత్న ఖచిత ఆయుధాలు, ఇతర వస్తువులు తొమ్మిది కోట్ల విలువ చేస్తాయట. నాదిర్‌షా 60 లక్షల వెండి నాణాలు, అనేకవేల బంగారు నాణాలు, కోటి విలువగల బంగారు సామాను, 50 కోట్ల విలువగల బంగారు నగలు పట్టుకుపోయినట్లు అతని కొలువులో వజీరుగా చేరిన ఒక భారతీయుడి క్రింది ఉద్యోగి అయిన ఆనందరాం వ్రాశాడు. నాదిర్‌షా యొక్క చరిత్రకారుడి లెక్కప్రకారం నాదిర్‌షా ఒకకోటి తొంభై వేల నవరసుల ఖరీదుగల నాణేలను పట్టుకుపోయాడు. స్కాట్‌లాండ్ దేశపు గ్రంథకర్త ఒకరు 11 కోట్ల 90 లక్షల నవరసుల ఖరీదుగల సంపదను నాదిర్‌షా తరలించుకుపోయాడని వ్రాశాడు.

కోహినూర్ వజ్రాన్ని నాదిర్‌షా చేజిక్కించుకున్న వైనం ఈ విధంగా వుంది. ఈ వజ్రం వున్న ప్రదేశం అతనికి ఎవరూ చెప్పలేక పోయారు. చివరికి అహ్మద్‌షా అంతఃపుర స్త్రీ ఒకరు ఈ వజ్రం ఆయన తలపాగాలోనే

దాచుకుంటాడని చెప్పింది. దాన్ని చేజిక్కించుకోవడానికి నాదిర్‌షా ఒక పథకం వేశాడు. ఒక విందు సమావేశం ఏర్పాటు చేసి, అందులో తమ స్నేహానికి గుర్తుగా తామిద్దరూ తలపాగాలు మార్చుకుంటామని ప్రకటించాడు. అపట్లో రాజులలో ఈ ఆచారం ఉండేది. అహ్మద్‌షాకు తలపాగా ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. అహ్మద్‌షా తలపాగాతో తన విడిదికి వెళ్ళిన నాదిర్ షా తలపాగా మడతల్లోని ఈ అమూల్య వజ్రాన్ని చూసి కోహినూర్! అని ఒక పొలికేక పెట్టాడట. "కోహ్-ఇ-నూర్" అంటే తేజః పర్వతం. ఒక పర్వతమంత వెలుగును ఈ వజ్రం ఇస్తుందని అతని భావన. అప్పటి నుంచీ ఈ వజ్రానికి "కోహ్-ఇ-నూర్" - కోహినూర్ అన్నపేరు స్థిరపడిపోయింది.

నాదిర్‌షాలో దురాశ పెచ్చరిల్లిపోయింది. ధనం కోసం తన-పర భేదం లేకుండా అందరినీ బాధించడం ప్రారంభించాడు. చివరికి తన మనుషుల చేతిలోనే 1747లో నాదిర్‌షా దారుణ హత్యకు గురయ్యాడు. కోహినూర్ వజ్రం మళ్ళీ చేతులు మారడం మొదలైంది. చివరికి ఆఫ్ఘన్ రాజ కుటుంబం వద్దకు చేరింది. 1810లో అహ్మద్‌షా అనే విప్లవ నాయకుడు రాచరికంపై తిరుగుబాటు చేశాడు. అప్పటి వరకు సింహాసనం కోసం పెనుగులాడుతూ ఒకరినొకరు పదవీభ్రష్టులను చేసుకుంటున్న ఆఫ్ఘన్ రాజకుమారులు మహ్మద్, షాషుజాలు ఇరువురూ దేశం వదిలి పారిపోయి 'పంజాబు సింహంగా' పేరు పొందిన సిక్కు నాయకుడు రంజిత్‌సింగ్ శరణు జొచ్చారు.

షాషుజా వద్ద కోహినూర్ వజ్రం వున్న విషయం గ్రహించిన రంజిత్‌సింగ్ నయాన, భయాన అతని నుంచి ఆ వజ్రాన్ని 1813 జూన్ 1వ తేదీన రాబట్టుకున్నాడు. పంజాబ్ నేలిన బలీయుడైన సిక్కురాజులలో మొదటివాడు - చివరివాడు రంజిత్‌సింగే.

ఆయన తరువాత ఆయన కుమారులు ముగ్గురు ఒకరి తరువాత ఒకరు పంజాబును ఏలారు. వీరందరూ బలహీనులు; అందరూ అర్ధాంతరంగా చనిపోయినవారే. 1843లో రంజిత్‌సింగ్ చివరి కుమారుడు ధులీప్‌సింగ్ రాజ్యానికి వచ్చాడు. ఇతను మైనర్. ఇతని కాలంలో రెండు సిక్కు యుద్ధాలు

జరిగి, పంజాబు బ్రిటిష్ వారి పరమైంది. 1849 మార్చి 29న లాహోర్ రాజప్రాసాదం మీద బ్రిటిష్ పతాకం ఎగిరింది. పంజాబును బ్రిటిష్ సామ్రాజ్యంలో కలుపుతూ లాంఛనంగా చేసుకున్న ఒప్పందంలో "షాషుజా ఉల్ముల్క్ నుంచి రంజిత్ సింగ్ స్వాధీనం చేసుకున్న కోహినూర్ వజ్రాన్ని లాహోర్ మహారాజు బ్రిటిష్ రాణికి అప్పగించాల"న్నది ఒక అంశం.

కోహినూర్ వజ్రాన్ని ముగ్గురు బ్రిటిష్ సభ్యులతో ఏర్పాటైన పంజాబు ప్రభుత్వానికి అప్పగించడం జరిగింది. ఈ ముగ్గురిలో ఒకరైన జాన్ లారెన్స్‌కు దీని రక్షణ బాధ్యత అప్పగించడమైంది. అయితే ఈయన ఈ వజ్రాన్ని భద్రపరచిన పేటికను తన కోటు జేబులో వుంచుకుని, ఆ విషయం మరిచిపోయి కోటును విడిచి ప్రక్కన పడేశాడు. ఈ సంఘటన జరిగిన ఆరువారాలకు గవర్నర్ జనరల్ లార్డ్ డల్‌హౌసీ నుంచి వర్తమానం వచ్చింది రాణీగారు వజ్రాన్ని బ్రిటన్‌కు తరలించే ఏర్పాటు చేయమని ఉత్తర్వులు జారీ చేశారని. ఈ విషయం ముగ్గురు సభ్యుల సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. అప్పుడు కానీ జాన్ లారెన్స్‌కు గుర్తుకు రాలేదు – వజ్రాన్ని తాను కోటు జేబులో వదిలేశానని. ఆయన గొంతు తడారిపోయింది. తన నివాసానికి చేరిన వెంటనే వజ్రాన్ని వుంచిన్న పెట్టె గురించి పనివాణ్ణి అడిగాడు – "కొన్ని రోజుల క్రితం నా కోటు జేబులో నుంచి ఒక చిన్న పెట్టె తీశావా" అని. ఆ పనివాడు పెట్టెను కోటు జేబులో నుంచి తీసి లారెన్స్ కప్‌బోర్డులో ఉంచానని చెప్పాడు. లారెన్స్‌కు ప్రాణాలు లేచివచ్చాయి. ఆ పెట్టెను తెమ్మని పనివాడికి చెప్పగా అతనాపెట్టెను తెచ్చి, లారెన్స్ ముందే తెరిచి, గుడ్డ పేలికల మధ్య నుంచి వజ్రాన్ని బయటికి తీసి, తన చేతిలో వున్న వస్తువు ఎంతటి అమూల్యమైందో తెలియక, "దొరా ! ఇందులో ఏమీ లేదు – ఒక చిన్న గాజు ముక్క తప్ప" అని చెప్పాడు. లారెన్స్ వెంటనే ఆ వజ్రం ఉన్న పెట్టెను నౌకరు నుంచి దొరక పుచ్చుకుని మిగిలిన ఇద్దరు సభ్యుల వద్దకు వెళ్ళి చూపించాడు. ఈ విధంగా కోహినూర్ వజ్రం దాదాపుగా పోయి, దాని విలువ గ్రహించలేని నౌకరు మూలంగా మళ్ళీ దొరికింది.

ఈ వజ్రాన్ని బ్రిటిష్ మహారాణికి పంపడానికి అన్ని ఏర్పాట్లు చకచకా జరిగి పోయాయి. మొదట కోహినూరును లాహోరు నుంచి బొంబాయికి తరలించారు. దారి పొడుగునా దొంగలు, దోపిడిదార్లు ఉన్న ఆ రోజుల్లో ఈ పనే ఎంతో కష్టసాధ్యమయింది. దానిని అద్వితీయమైన రత్నంగా కొనియాడిన గరవ్నర్ జనరల్ డల్హౌసీ స్వయంగా ఈ పనికి పూనుకొని, కోహినూరును లండన్‌కు భద్రంగా పంపడానికి వ్యక్తిగత శ్రద్ధ తీసుకున్నాడు. 1850 మే 16న డల్హౌసీ ఈ విధంగా వ్రాశాడు.

"బొంబాయి నుంచి కోహినూరు "హెచ్.యం.యస్. - మీడియా" అన్న ఓడలో ఏప్రిల్ 16న బయలుదేరింది. దీన్ని లాహోరు నుంచి ఎంత రహస్యంగా బొంబాయికి తీసుకురావలసి వచ్చిందంటే, నేనే స్వయంగా నా చేతులతో ఈ పని చేశాను. దీన్ని తెచ్చి బొంబాయిలోని ట్రెజరీలో భద్రపరిచే వరకు నేననుభవించిన ఆందోళన అంతకు ముందెప్పుడూ నా జీవితంలో లేదు. దాన్ని ట్రెజరీలో భద్రపరిచిన పిమ్మట నా ఆనందానికి అవధుల్లేవు. ఎంతో హాయిగా ఊపిరి పీల్చుకున్నాను. నా నడుముకు కట్టుకున్న బెల్టుకు కోహినూర్ వజ్రం ఉన్న పెట్టెను పెట్టిన సంచిని ఒకటికి రెండు సార్లు గట్టిగా కుట్టాను. ఆ బెల్టు ఒక చివరను ఒక గొలుసుతో నా మెడకు బంధించాను. రాత్రి - పగలు తేడా లేకుండా దాన్ని నా ఒంటికి అలాగే ఉంచుకున్నాను. నా అదృష్టం బాగుండి, దాన్ని భద్రంగా ఘాజీఖాన్‌తో కలిసి, కాప్టెన్ రాంసేకు అందజేసి, అతను దాన్ని ట్రెజర్ ఛెస్ట్‌లో భద్రపరచడం స్వయంగా వీక్షించి, బయటకు వచ్చి కుదుటపడ్డాను. దాన్ని వదలించుకుని ఎంతో రిలీఫ్ పొందాను. బొంబాయిలో దీన్ని రెండు నెలలపాటు ఓడ అందుబాటులో లేక ఉంచాల్సి వచ్చింది. ఇది జూలై నాటికి భద్రంగా మహారాణీ వారికి చేరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను. దీనిని ఆధికారికంగా అధికారగణానికి, మహారాణీ వారికి మెయిల్ ద్వారా తెలియజేసుకున్నాను".

దీన్ని లండన్‌కు తరలించడానిక ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు.

కోహినూర్ వజ్రాన్ని మొదట ఒక ఇనుపపెట్టెలో పెట్టారు. దాన్ని ఒక డిస్పాచ్‌బాక్స్‌లో ఉంచి ప్రభుత్వ ఖజానాలో ఉంచడం జరిగింది. ఇందులో ఏముందో ఇటు ట్రెజరీ అధికారులకు కానీ, అటు ఓడలో షిప్ కాప్టెన్ కమాండర్ లక్కియర్‌కు గాని తెలియనివ్వలేదు. దాన్ని గురించిన రహస్యం తెలిసిన వారిద్దరే – వారు లెఫ్టినెంట్ కల్నల్ మ్యాక్‌సన్, కెప్టెన్ రాంసే. ఈ అమూల్య వజ్రాన్ని బ్రిటిష్ రాణికి సురక్షితంగా చేర్చే బాధ్యత వారిద్దరికే అప్పగించడమైంది. ప్రయాణంలో ఓడ రెండు సార్లు అనుకోని చిక్కుల నుంచి బయటపడి, కోహినూర్ భద్రత గురించి భయాలు వెంట్రుక వాసిలో తప్పిపోయాయి. ఓడ మారిషస్ దీవిని చేరుకున్నప్పుడు ఓడలోని ప్రయాణీకులకు కలరా వ్యాపించింది. అందువల్ల స్థానిక ప్రజలు ఓడ సిబ్బందికి అవసరమైన పదార్థాలు అమ్మడానికి నిరాకరించారు. రేవు నుంచి ఓడను వెంటనే ఖాళీ చేయమని స్థానిక అధికారులు ఆదేశించారు. ఓడ వెంటనే బయలుదేరకపోయే సరికి ఓడపై కాల్పులు జరిపి, దాన్ని ధ్వంసం చేయడానికి అనుమతించవలసిందిగా గవర్నర్‌ను కోరారు. ఆ పరిస్థితుల్లో మారిషస్‌ను వదిలిన “మీడియా”కు కొన్ని రోజుల్లోనే మరో ప్రమాదం ఎదురైంది. సముద్రంలో ప్రచండమైన ఝంఝూ మారుతం చెలరేగి, పన్నెండు గంటల పాటు నానా బీభత్సం సృష్టించింది. ఇబ్బందులన్నీ అధిగమించి, ఓడ ఇంగ్లాండ్‌లోని ప్లైమౌత్ రేవుకు చేరుకుంది. అక్కడ ప్రయాణీకులను, మెయిల్‌ను దింపివేశారు. కానీ కోహినూర్‌ను మాత్రం దింపలేదు. దాన్ని పోర్టుమౌత్‌లో దింపారు. అక్కడి నుంచి కోహినూర్‌ను ఈ ఇద్దరు అధికారులు ఈస్టిండియా హౌస్‌కు తీసుకువెళ్ళి, కంపెనీ ఛైర్మన్‌కు, డిప్యూటీ ఛైర్మన్‌కు దాన్ని అప్పగించారు. కంపెనీ డిప్యూటీ ఛైర్మన్, బకింగ్‌హాం పాలెస్‌లో కోహినూర్‌ను 1850 జూలై 3వ తేదీన విక్టోరియా మహారాణికి అందజేశాడు.

లండన్‌లోని హైడ్ పార్క్‌లో ఏర్పాటుచేసిన గ్రేట్ ఎగ్జిబిషన్‌లో కోహినూర్ వజ్రాన్ని ప్రజల సందర్శన కోసం ఉంచారు. మొత్తం ఎగ్జిబిషన్ కంతటికి కోహినూరే పెద్ద ఆకర్షణగా మారి ప్రజలు దీన్ని చూడటానికి తండోప

తండాలుగా విరగద్రొక్కుకుని వచ్చారని, దీని రక్షణ కోసం ఎన్ని ఏర్పాట్లు చేసినా తక్కువే అనిపించాయని “ది టైమ్స్” దిన పత్రిక వ్రాసింది.

కోహినూర్ వజ్రాన్ని సరిగ్గా సానబట్టలేదని, దీన్ని అన్ని కోణాల్లో తగిన విధంగా సానబట్టితే, కోహినూర్ అందాలు ద్విగుణీకృతమవుతాయని బ్రిటిష్ వజ్ర నిపుణులు భావించారు. ఆ ప్రకారం ఎంతో మంది శాస్త్రవేత్తలను, వజ్రనిపుణులను రావించి, కోహినూర్‌ను పరిశీలింపజేసి, సుదీర్ఘంగా చర్చలు జరిపి, కోహినూర్ సహజ అస్థిత్వానికి భంగం వాటిల్లకుండా దానిని తిరిగి సానబట్టడానికి ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని రూపొందించారు. ఈ సానబట్టే పనిని ఎప్పటికప్పుడు వివరంగా రికార్డు చేయాలని కూడా నిర్ణయించారు. ఆ విధంగా కోహినూర్‌ను సానబట్టే పని 38 రోజులు కొనసాగింది. దీనికి 8,000ల బ్రిటిష్ ఫౌండ్లు (40,000ల అమెరికన్ డాలర్లు) ఖర్చయ్యాయి. చివరికి 108.93 మెట్రిక్ కారెట్స్‌తో కోహినూర్ వజ్రం నిగ్గు తేలింది. ఈ క్రమంలో వజ్రం తన పరిమాణంలో 43 శాతం నష్టపోయింది.

ఈ అమూల్య వజ్రాన్ని భారత్ నుంచి స్వాధీనం చేసుకోవడంపై ఇంగ్లండ్‌లో అనేక విమర్శలు వెల్లువెత్తాయి. ఇది ఇంగ్లండ్ సొత్తు కాదనీ, దౌర్జన్యంగా దానిని స్వాధీనం చేసుకోవడం అనైతికమని వాదిస్తున్నవారి నోళ్ళు కట్టేయడానికి ఒక పథకం వేయబడింది. పంజాబ్ రాజ్యవారసుడు ధులీప్ సింగ్ మైనర్ అన్న కారణంగా అతని రాజ్యాన్ని, కోహినూర్ వజ్రాన్ని స్వాధీనం చేసుకున్న ఈస్టిండియా కంపెనీ ప్రభుత్వం, అతని సంరక్షణ భాధ్యతలను లోగిన్ అన్న అతనికి అప్పగించింది. లోగిన్ మరణానంతరం ఈ బాధ్యత అతని భార్య లేడీ లోగిన్‌కు అప్పగించబడింది. ఒకరోజు ధులీప్‌సింగ్‌ను లేడి లోగిన్ విక్టోరియా మహారాణి సమక్షానికి తెచ్చింది. విక్టోరియా రాణి ధులీప్ సింగ్‌ను దగ్గరికి తీసుకుని, తిరిగి చెక్కడం మూలంగా ఆకారం మారిపోయిన కోహినూర్ వజ్రాన్ని అతనికి ఇచ్చి, దీనిని గుర్తుపట్టగలవా అని ప్రశ్నించింది. ధులీప్‌సింగ్ ఆ వజ్రాన్ని చూసి అస్పష్టంగా ఏదో చెప్పి, విక్టోరియా రాణికి దాన్ని తిరిగి ఇచ్చివేశాడు. దీనితో ధులీప్‌సింగ్ ఇష్టపూర్వకంగానే కోహినూర్

వజ్రాన్ని విక్టోరియా మహారాణికి సమర్పించాడని ప్రచారం చేశారు. అయితే, ఈ ప్రచారాన్ని ఎవరు నమ్మలేదు. ధులీప్‌సింగ్ విధిలేని పరిస్థితులలోనే కోహినూర్‌ను విక్టోరియా రాణికి ఇచ్చాడన్నది జగమెరిగిన సత్యం.

కోహినూర్ వజ్రం ఇంగ్లాండ్ చేరిన పిమ్మట ఆదేశంలో కొన్ని అరిష్టాలు సంభవించాయి. ఇదంతా కోహినూర్ వల్లే జరిగిందని ప్రచారం జరిగింది. కోహినూర్ ఎవరివద్ద వుంటే వారికి కీడు జరిగిందని, అశాంతికి, రక్తపాతానికి కోహినూరు కారణమవుతూ వచ్చిందని పెద్ద దుమారం రేగింది. దీనిని తిప్పికొడుతూ డల్‌హౌసీ 7.1.1858న మాల్టా నుంచి ఒక లేఖ వ్రాశాడు. అందులో :

"కోహినూర్ వల్ల దానిని గోల్కొండ నుంచి పొందిన అక్బర్ చక్రవర్తికి ఏ అపకారం జరగలేదు. అతని కుమారునికి, మనుమనికి కూడా ఏ కీడు జరగలేదు. మొగల్ చక్రవర్తులలో అత్యంత ప్రసిద్ధుడైన ఔరంగజేబుకూ దానివల్ల ఏ అరిష్టం జరగలేదు. నాదిర్‌షా, అహ్మద్‌షా దులానీ దీనివల్ల లబ్ధినే పొందారు. మహారాజా రంజిత్‌సింగ్ ఈ వజ్రాన్ని తన వద్ద నుంచుకొని మొత్తం సిక్కు జాతికే తిరుగులేని నాయకుడుగా ఎదిగాడు. చరిత్రలో చక్రవర్తులకు, మహారాజులకు, మహాయోధులకు ఈ వజ్రం విజయచిహ్నంగా నిలిచింది. ఒకవేళ దీనివల్ల అరిష్టం ఉందని మహారాణి వారు భావిస్తే, ఆ వజ్రాన్ని నాకు ఇచ్చివేయండి. ఆ అరిష్టమేదో నేనే భరిస్తాను".

విక్టోరియా మహారాణి కోహినూర్‌ను డల్‌హౌసీకి తిరిగి ఇచ్చివేయలేదు. అది బ్రిటిష్ రాణుల ముఖ్య ఆభరణాలలో ఒకటయి పోయింది. 1911లో క్వీన్ మేరీ పట్టాభిషేకం సందర్భంగా తయారు చేసిన వజ్రాల కిరీటంలో కోహినూర్ వజ్రం కిరీటం ముందుభాగంలో మధ్యన నిలిచి ప్రముఖ స్థానం పొందింది.

20వ శతాబ్దంలో కోహినూర్ వజ్రం ఎవరికి చెందాలి అన్న విషయమై పెద్ద వివాదమే చెలరేగింది. రాజకీయ పార్టీలు తమకు అనుకూలంగా ఈ వివాదాన్ని బాగా వాడుకున్నాయి. 1947లో భారత ప్రభుత్వం కోహినూరు వజ్రాన్ని తిరిగి ఇచ్చి వేయమని బ్రిటిష్ ప్రభుత్వాన్ని కోరింది. కోహినూర్ వజ్రం రంజిత్‌సింగ్‌కు సంక్రమించిందని చరిత్ర చెబుతున్నా, ఈ విషయాన్ని రంజిత్

సింగ్ కోశాధికారి బలపరుస్తున్నా, ఒరిస్సా ప్రభుత్వం ఈ వజ్రం జగన్నాథ స్వామిదనీ కాబట్టి దానిని తమకు అప్పగించాలని కోరింది.

1953లో క్వీన్ ఎలిజబెత్–II పట్టాభిషేక సందర్భాన్ని పురస్కరించుకుని భారత ప్రభుత్వం మరోసారి కోహినూర్‌ను భారత్‌కు అప్పగించమని కోరింది. అయితే నిజమైన పోరు 1976లో పాకిస్తాన్ ప్రధాని జుల్ఫికల్ ఆలీ భుట్టో కోహినూరు పాకిస్తానుకు చెందుతుందని ప్రకటించడంతో ప్రారంభమైంది. ఆయన వాదన ప్రకారం రంజిత్ ఏలిన పంజాబ్ రాజధాని లాహోర్ ప్రస్తుతం పాకిస్తాన్‌లో ఉంది, కాబట్టి ఆ వజ్రం పాకిస్తాన్‌ది. ఈ వాదనను బ్రిటిష్ ప్రభుత్వం త్రిప్పికొడుతూనే, కోహినూర్ వజ్రాన్ని ఎవరికీ ఇచ్చేది లేదని, దీనిని ఏ యుద్ధంలోను బ్రిటన్ స్వాధీనం చేసుకోలేదని, దీనిని బహుమతిగా పొందడం జరిగిందని తమ ఉద్దేశ్యం తేల్చి చెప్పింది. అయితే పాకిస్తాన్ ఈ వాదనతో ఏకీభవించలేదు. పంజాబ్ రాజవంశీకుల నుంచి దీనిని ఒప్పందంలో భాగంగా స్వాధీనపరచుకున్నట్లు చరిత్ర చెబుతున్న విషయాన్ని గుర్తు చేసింది. భారత్ ఈ వాదనను వ్యతిరేకిస్తూ, కోహినూర్ తమకే చెందుతుందని నొక్కి చెప్పింది. టెహరాన్‌లోని ఒక ప్రముఖ వార్తాపత్రిక ఈ వజ్రం ఇరాన్‌కు చెందుతుందని ప్రకటించింది. డల్‌హౌసీ మునిమనుమడు ఒకడు ఇది డల్‌హౌసీ ఆధీనంలో ఒక సంవత్సరానికి మించి వున్నందున, ఈ వజ్రం ఆయన వారసుడుగా తనకే చెందుతుందని వాదించాడు.

బ్రిటిష్ పరిపాలనాదక్షులలో ఒకడుగా పేరుపొందిన సర్ ఓలాఫ్ క్యారో 'ది టైమ్స్' పత్రికలో ఈ విధంగా వ్రాశాడు. "కోహినూరు మొగలుల ఆధీనంలో 213 సంవత్సరాలు, ఆఫ్ఘన్‌ల ఆధీనంలో కాందహార్‌లోను, కాబూల్‌లోను 66 సంవత్సరాలు, బ్రిటిష్ వారి ఆధీనంలో 127 సంవత్సరాలు ఉంది. బ్రిటిష్‌వారు దీనిని లాహోరు నుంచి స్వాధీనం చేసుకున్న మాట వాస్తవమే. అయితే అంతకు ముందటి వారసులు కూడా ఇంకా వున్నారు. ఢిల్లీని పాలించిన మొగలులు వాస్తవానికి టర్కీ దేశస్తులు. బ్రిటిష్ వారు వజ్రాన్ని స్వాధీనం చేసుకునే నాటికి లాహోరును పాలించినవారు సిక్కులు. కాబట్టి దీనిని ఎవరికి తిరిగి ఇవ్వాలి అన్నది తేల్చడం కానిపని".

చారిత్రకంగా కోహినూర్ ఎవరికి చెందుతుందన్న విషయం తేల్చడం కష్టసాధ్యమే. కానీ రత్నశాస్త్రపరంగా చూస్తే ఇది భారతదేశపు మట్టిలో పుట్టింది. కాబట్టి దీనిపై భారతదేశపు హక్కు ఎవరూ కాదనలేనిది.

ఏది ఏమైనప్పటికీ తెలుగుగడ్డపై పుట్టిన ఒక అనర్ఘరత్నం దేశదేశాలు తిరిగి, రాజ్యాధినేతల తలరాతలు మార్చి, ప్రపంచ ప్రసిద్ధి పొంది, ఈ నాటికీ, ఏనాటికీ విలువ కట్టలేని అపూర్వ వస్తువుగా నిలిచి పోయింది.

దురానీ చక్రవర్తి షాషుజా భార్య బేగం షా చెప్పినట్లుగా డల్‌హౌసీ కోహినూర్ వజ్రం విషయంలో వ్రాసిన ఈ క్రింది వాక్యాలు అక్షర సత్యాలు :

ఒక బలిష్టుడైన వ్యక్తి ఐదు గులకరాళ్ళను తీసుకుని, తన శక్తి కొద్దీ ఒక రాయిని తూర్పువైపుకు, ఒక రాయిని పశ్చిమ దిశగా, ఒకటి ఉత్తర దిశగా, మరొకటి దక్షిణ దిశగా విసరివేసి, ఐదవరాయిని తన తలపైకి వెళ్ళగలిగినంత ఎత్తుకు విసరగా, ఈ నాలుగు రాళ్ళు పడ్డ విస్తీర్ణంలో పైకి విసరిన రాయి వెళ్ళినంత ఎత్తులో ఈ ప్రపంచంలోని బంగారును, వజ్రాలను నింపితే కూడా ఆ సంపద విలువ కోహినూరు వజ్రానికి సరి సమానం కాలేదు".

మన మట్టిలో పుట్టిన అపూర్వమైన, అమూల్యమైన కోహినూర్ వజ్రాన్ని మనం దక్కించుకోలేకపోయినందుకు అపరిమితమైన బాధ, శతాబ్దాల పాటు ఎక్కడెక్కడో తిరిగి, మరుగునపడిపోకుండా చివరకు బ్రిటిష్ మహారాణుల కిరీటంలో స్థానం పొంది, లండన్ టవర్ మ్యూజియంలో సందర్శకులను అలరిస్తూ, తను పుట్టినగడ్డకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తెచ్చినందుకు ఆనందం ఒక్కసారిగా నన్ను ముంచెత్తాయి.

ఈ కోహినూర్ వజ్రం తెలుగునాట లభించడం తెలుగువారుగా మనందరికీ గర్వకారణం. ప్రముఖ కవి తుమ్మల సీతారామమూర్తిగారి "తెలుగుతల్లీ! నీకు జోహారు, దేశమాతా! నీకు జోహారు" అనే గీతంలో –

**"కొల్లూరి కోహినూరు కొప్పులో ౘూవటే**
**కోలారు గనులు నీ కోశంబటే...."**


అనే చరణాలు ఈ సందర్భంగా గుర్తుకొచ్చాయి.

★★★

# తెలుగు భాషా భానుడు సి.పి. బ్రౌన్

తెలుగు భాషా సాహిత్యాలు కొడిగట్టి పోకుండా చేతులడ్డుపెట్టి కాపాడిన మహానుభావుడు ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఈయన తెలుగు సాహిత్యానికి విశేషమైన సేవలందించి తెలుగు ప్రజల హృదయాల్లో శాశ్వతంగా నిలిచిపోయారు.

తెలుగు సాహిత్యం 18వ శతాబ్ద కాలానికి క్షీణ దశకు చేరుకుంది. అప్పటి సాంఘిక, రాజకీయ పరిస్థితులతో పాటు, తెలుగులో సృజనాత్మక కవులు కొరవడటం, నిరక్షరాస్యత పెరిగిపోవడం, తెలుగు భాషాసాహిత్యాలను పోషించి, ప్రోత్సహించిన విజయనగర రాజుల వంటి ప్రభువులు లేకపోవడం ఇందుకు ముఖ్య కారణాలు.



సి.పి. బ్రౌన్ ఈ ప్రాంతానికి అధికారిగా వచ్చి, తాళపత్ర నిక్షిప్తమైవున్న అనర్ఘ తెలుగు సాహిత్యాన్ని సేకరించి, వెలికితీసి, తెలుగు భాషా సంస్కృతులను పరిరక్షించారు. ఆయన మాటల్లోనే "తెలుగు సాహిత్యం మరణశయ్యపై ఉంది. 1825 నాటికి దీపం మిణుకుమిణుకు మంటున్నది. తెలుగు సాహిత్యం చనిపోవడం నేను చూశాను. అయితే ముప్పై ఏళ్ళలో దాన్ని తిరిగి బ్రతికించగలిగాను".

బ్రిటిష్ జాతీయుడైన సి.పి. బ్రౌన్ 10.11.1798న కలకత్తాలో జన్మించాడు. ఈయన తండ్రి డేవిడ్ బ్రౌన్ కలకత్తాలో ఒక అనాధ శరణాలయానికి, మిషనరీకి మేనేజర్‌గా పనిచేశాడు. ఈయన సంస్కృతం సహా ఎన్నో భాషల్లో పండితుడు. ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ తన తండ్రి మరణానంతరం 1812లో ఇంగ్లండుకు వెళ్ళిపోయాడు. తిరిగి 1817 ఆగస్టు 4వ తేదీన మద్రాసుకు చేరుకున్నాడు. భారత్‌లో సివిల్ సర్వీసులో ఉద్యోగం సంపాదించుకోవడానికి అవసరమైన శిక్షణ పొందడానికిగాను హెయిలీ బర్రే కళాశాలలో జేరాడు.

1820లో మద్రాసు గవర్నర్ థామస్ మన్రో, ప్రతి ప్రభుత్వాధికారి ఒక స్థానిక భాషను తప్పనిసరిగా నేర్చుకోవాలని ఉత్తర్వులు వేశాడు. కాబట్టి పాఠ్యాంశాలలో భాగంగా సి.పి. బ్రౌన్ ఒక స్థానిక భాషను నేర్చుకోవలసి వచ్చింది. ఆ పరిస్థితిలో ఆయన తెలుగు భాషను ఎంచుకుని, వెలగపూడి కోదండరామ పంతులు శిక్షణలో తెలుగు నేర్చుకోవడానికి పూనుకున్నాడు.

బ్రౌన్ తెలుగు పరీక్షను, సివిల్ సర్వీసు పరీక్షను 1820లో పాసైనాడు. కడప జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్న హన్‌బర్రీకి డిప్యూటీగా బ్రౌన్‌కు ఉద్యోగం వచ్చింది. హన్‌బర్రీ తెలుగు భాషను అనర్గళంగా మాట్లాడటం గమనించిన బ్రౌన్ ఆయన నుంచి స్ఫూర్తిని పొంది, తాను కూడా తెలుగు మీద పట్టు సాధించాలని పూనుకున్నాడు. ఆయన 1824లో మచిలీపట్టణానికి, ఆ తరువాత రాజమండ్రికి బదిలీ చేయబడ్డాడు. బందరులో సి.పి. బ్రౌన్ చేసిన తెలుగు భాషాసేవ వారి మాటల్లోనే :

“తెలుగు దేశానికి రాజధానియైన బందరు (మచిలీపట్టణము)లో నేను మూడు సంవత్సరములు న్యాయాధిపతిగా వ్యవహరించేను. అక్కడ నేను సంస్కృతాంధ్ర గ్రంథముల వ్రాతప్రతులు చాలా సంపాదించేను. వాని సంపాదన నాకొక “పిచ్చిగా” పరిణమించిందంటే అతిశయోక్తికాదు. అక్కడ నేను ఒక దమ్మిడీ నిలవచేయలేదు. నా వద్ద ఎప్పుడూ ఇరవై మంది

బ్రాహ్మణులు, శూద్రులు వీటి గురించి పనిచేసేవారు. వారికందరకు జీతము లేర్పాటు చేసెను. ప్రాచీన కావ్యాలు కాగితాల మీద వ్రాయడము, సప్రమాణికములైన పాఠములతో వానిని సంస్కరించడము, పదానుక్రమణికలు తయారుచేడము, వ్యాఖ్యానాలు వ్రాయడము వారి పని.".

తెలుగులో కోర్టు తీర్పు ఉత్తర్వులు ఇచ్చిన ఘనత కూడా ఆయనకే దక్కింది.

ఆ కాలంలో గుంటూరు ప్రాంతం భయంకరమైన క్షామాన్ని ఎదుర్కొంటున్నది. 1832-33లలో ఈ క్షామాన్ని ఎదుర్కోవటంలో బ్రౌన్ కనబరచిన పాలనాదక్షత అందరి మన్ననలు పొందింది. 1834లో ఆయన ప్రభుత్వోద్యోగం నుంచి విడుదలై లండన్‌కు వెళ్ళిపోయి 1835 నుంచి 1838 వరకు అక్కడే ఉన్నాడు. 1838లో ఈస్టిండియా కంపెనీకి పర్షియన్ అనువాదకుడుగా బ్రౌన్ తిరిగి మద్రాసుకు చేరుకున్నాడు. మద్రాసు కాలేజి బోర్డు సభ్యుడుగా కూడా సేవలందించి 1854లో అనారోగ్యం వల్ల ఉద్యోగ విరమణ చేసి, లండన్‌కు వెళ్ళిపోయాడు. లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా కొంతకాలం పనిచేశాడు. ఆయన 1884 డిసెంబర్ 12న కన్నుమూశాడు.

బ్రౌన్ తెలుగు భాషాసాహిత్యాలకు చేసిన సేవలు ఎనలేనివి. ఉచిత విద్యను, ఉచిత ఆహారాన్ని అందించే పాఠశాలలను నెలకొల్పారు. ఈ విషయం సి.పి. బ్రౌన్ తన స్వీయచరిత్రలో ఈ విధంగా వ్రాసుకున్నారు -

"నేనెక్కడ పనిచేసినా, బాలురకు తెలుగు, హిందూస్థానీ విద్యాభ్యాసము నిమిత్తము ఉచిత పాఠశాలలను నెలకొల్పేవాడను. ఆయా ప్రాంతము వారినే ఉపాధ్యాయులుగా నియమించేవాడను. 1821లో కడపలో రెండింటిని, 1823లో బందరులో రెండింటిని స్థాపించేను.

1844లో మదరాసులో ఒక ఉచిత పాఠశాల పెట్టేను. అందులో 80 మంది తెలుగు, తమిళ విద్యార్థులుండేవారు. ఇది ఏడేండ్లు నడచినది. కానీ

దాని యాజమాన్యము మరొకరికి అప్పగించేను. కాని అది సరిగా నడవలేదు. తరువాత క్రైస్తవ మిషనరీలకు దాన్ని అప్పగించేను."

1824లో ఆయనకు వేమన సాహిత్యం మీద ఆసక్తి కలిగింది. వేమన సాహిత్యాన్ని తెలుగు ఛందస్సును, వ్యాకరణాన్ని తిప్పాభొట్ల వెంకటశివశాస్త్రి, అద్వైత బ్రహ్మశాస్త్రి మార్గదర్శకత్వంలో క్షుణ్ణంగా అధ్యయనం చేశాడు. వేమన పద్యాలను సేకరించి, 693 పద్యాలతో 1827లో మొదటి సంపుటాన్ని, 1164 పద్యాలతో 1839లో రెండవ సంపుటాన్ని ప్రచురించాడు. వీటికి ఆంగ్లానువాదాలు కూడా ప్రచురించాడు. బందరు నుంచి ఆయనను రాజమండ్రికి బదిలీ చేశారు. అక్కడ కూడా ఆయన తెలుగు సాహిత్య సేవను, భాషాధ్యయనాన్ని కొనసాగించాడు. అంతరించిపోయే దశలో ఉన్న తెలుగు కావ్యాల వ్రాత ప్రతులను సేకరించాడు. కొందరు వ్రాయసగాళ్ళను తన స్వంత డబ్బుతో నియమించి, వారితో ఈ కావ్యాలకు వ్రాత ప్రతులను సిద్ధం చేయించి, పండితులతో చర్చించి, దోషాలను సరిదిద్ది పరిష్కరించాడు. ఆంధ్ర మహాభారతాన్ని, ఆంధ్ర మహాభాగవతాన్ని పునర్ముద్రించాడు. శోభావిహీన అయిపోయిన తెలుగు సరస్వతికి ఆశ్రయం కల్పించి, పూర్వవైభవాన్ని తెచ్చాడు.

తెలుగు నేర్చుకోవడంలో ఆసక్తివున్న బ్రిటిష్ వారి కోసం ఆయన ఎన్నో వ్యాకరణ పుస్తకాలను, ఛందో గ్రంథాలను వ్రాశాడు. తెలుగు-ఇంగ్లీషు; ఇంగ్లీషు-తెలుగు నిఘంటువులను, తెలుగు వాచకాలను మొదటిసారిగా తయారు చేశాడు. సాహిత్య పత్రికలలో ఎన్నో వ్యాసాలను వ్రాశాడు. క్యావాలను అనువదించాడు. ఇవన్నీ ఇప్పటికీ మదరాసు ఓరియంటల్ లైబ్రరీలో ఉన్నాయి.

1824 నుంచి తిక్కన, పోతన, వేమన వంటి ప్రసిద్ధ కవుల రచనలను సేకరించడం ప్రారంభించాడు. 1835-38 మధ్య లండన్‌లో ఉన్నప్పుడు ఆయన 2,106 దక్షిణ భారతీయ భాషలకు చెందిన వ్రాత ప్రతులను ఇండియా

హౌస్ లైబ్రరీ నుంచి సేకరించి, మద్రాసు లైబ్రరీకి పంపాడు.

తెలుగు, సంస్కృత గ్రంథాల నెన్నింటినో పరిష్కరించి, ప్రచురించాడు. Madras Journal of Literature and Science కు సంపాదకుడుగా పనిచేశాడు. ఆయన ప్రాచీన కావ్యాలు సేకరిస్తున్నప్పుడు చోటు చేసుకున్న అనేక సంఘటనలను కథలు కథలుగా లండన్ నుంచి వెలువడే ది ఆసియాటిక్ జర్నల్‌లో వ్రాశాడు.


తెలుగు సాహిత్య పరిరక్షణకు బ్రౌన్ తన స్వంత డబ్బును ఖర్చు చేశాడు. తెలుగు భాషాభివృద్ధి కోసం ప్రతి పైసా పొదుపు చేసేవాడు. ఎంతో ఆర్థిక ఇబ్బందుల్లో వుండి కూడా తెలుగు కోసం ఖర్చు చేయడానికి వెనకడుగు వేయలేదు. తనకు వస్తున్న జీతంతో ఎంతో మంది పండితులను, వ్రాయసగాళ్ళను పోషించాడు.

తెలుగు సాహిత్యంలో ప్రసిద్ధి చెందిన కావ్యాలను సేకరించి ప్రచురించడమే కాక బ్రౌన్ జనసామాన్యం నోళ్ళలో సజీవంగా వుంటూ, తరం నుంచి తరానికి బదిలీ అవుతున్న మౌఖిక సాహిత్యాన్ని ఎంతో సేకరించి, గ్రంథస్థం చేసి భద్రపరిచాడు. ముద్రణకు అనువుగా వుండటానికి వీలుగా తెలుగు లిపిని సంస్కరించాడు. 'అరసున్నా'ను, బండి"ఱ"ను పరిహరించి, క్రావడిని మార్చాడు. తెలుగు పద్యపాదాలను 'యతి' స్థానంలో విరచడం ఆయన ప్రారంభించిన సంప్రదాయమే. బ్రౌన్ దొరకు యావత్ తెలుగు జాతి రుణపడివుంది.

## బ్రౌన్ సమాధి సందర్శన




2009 ఏప్రిల్ 26వ తేది నా జీవితంలో మరపురాని రోజు. లండన్‌లోని కెన్‌సల్ గ్రీన్ స్మశానవాటికలో ఉన్న సి.పి. బ్రౌన్ సమాధిని సందర్శించడం ఒక మధుర స్మృతి. లండన్ రావలసిందిగా యు.కె.లోని తెలుగు వైద్యబృందం పంపిన ఆహ్వానం పురస్కరించుకుని లండన్ వెళ్ళిన




సి.పి. బ్రౌన్ సమాధివద్ద నివాళులర్పిస్తున్న మండలి, యార్లగడ్డ



ప్రసిద్ధ చిత్రకారుడు మూల్‌రెడి సమాధి



కెన్సల్ గ్రీన్ స్మశానవాటిక ముఖద్వారం



కెన్సల్ గ్రీన్ స్మశానవాటికలో భారత సుప్రీం కౌన్సిల్ సభ్యుడు
సర్ విలియం కెన్‌మెంట్ సమాధి



కెన్సల్ గ్రీన్ స్మశానవాటికలో ఒక అద్భుతమైన శిల్ప సౌందర్య శోభిత సమాధి

నేను, ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తెలుగు దేశానికి ఎనలేని సేవలు చేసిన సి.పి. బ్రౌన్, సర్ ఆర్థర్ కాటన్ సమాధులు ఎక్కడున్నవో అన్వేషించి, వాటిని సందర్శించే అవకాశం కలిగితే ఈ యాత్రకు ఒక సాఫల్యత చేకూరుతుందని భావించాము.

ఇంటర్‌నెట్ సాయంతో కెన్‌సల్ గ్రీన్ స్మశానవాటికలో బ్రౌన్ సమాధి ఉందని తెలుసుకున్నాము. ఆ స్మశాన వాటిక బ్రిటన్‌లో ప్రతిష్ఠాత్మకమైనది. 2 లక్షల 56 వేల మంది పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్న గౌరవనీయులు, మహాశూరులే కాక, అప్రతిష్ఠపాలైన వ్యక్తుల భౌతికకాయాలు కూడా ఈ స్మశాన వాటికలో ఖననమయ్యాయి. ఈ స్మశాన వాటికలో తమతమ మతాలకు, సంప్రదాయాలకు అనువుగా ఉత్తర విధులు నిర్వర్తించుకునే అవకాశం ఉంది. 1833లో ఈ స్మశానంలో అంత్యక్రియలు మొదలైనాయి. ఇది లండన్‌లోని మొట్టమొదటి ఉద్యానవన స్మశాన వాటికగా పేరుగాంచింది.

ఇంగ్లండ్ రాజు – మూడవ జార్జి కుమారుడు హెచ్.ఆర్.హెచ్. ది డ్యూక్ ఆఫ్ ససెక్స్ అంత్యక్రియలు 1843లోను, ఆయన సోదరి యువరాణి హెచ్.ఆర్.హెచ్. సోఫియా అంత్యక్రియలు 1848లోను ఇక్కడ జరగడంతో ఈ స్మశాన వాటిక ప్రఖ్యాతి మిన్నంటింది. ఈ స్మశానవాటికలో నమోదైన వారిలో 550 మంది సుప్రసిద్ధ వ్యక్తులున్నారు. డిక్షనరీ ఆఫ్ నేషనల్ బయోగ్రఫీలో స్థానం పొందిన 700 మంది ప్రసిద్ధ వ్యక్తుల భౌతికకాయాలు ఇక్కడ ఖననమయ్యాయి.

ఈ స్మశానవాటికలో ఆయా కాలాల అద్భుత నిర్మాణ శైలికి ప్రతీకలుగా నిలిచే విధంగా, అపురూపమైన కట్టడాలున్నాయి. కట్టడానికి, కట్టడానికి సారూప్యత లేకుండా అత్యంత సౌందర్యోపేతంగా నిర్మితమైన కట్టడాలున్నాయి. అత్యంత అద్భుత సౌందర్యరాశి అయిన ఒక స్త్రీమూర్తి పాలరాతి ప్రతిమవున్న సమాధి ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. ప్రముఖ చిత్రకారుడు విలియం మూల్‌రెడి ఆర్.ఏ.(1786–1863) సమాధి వద్ద ఆయన మరణశయ్యపై

వున్నట్లుగా పాలరాతి విగ్రహాన్ని నెలకొల్పడమే కాక, దాని చుట్టూ ఆయన చిత్రించిన చిత్రాలను చెక్కారు. ఒక ప్రముఖ చిత్రకారుడికి శిల్పకళా వైభవంతో సమర్పించిన నివాళిగా ఇది కనిపిస్తుంది. మహర్షి దేవేంద్రనాథ్ టాగూరు సమాధి కూడా అక్కడే వుందని మాకు తర్వాత తెలిసింది. ప్రముఖుల స్థాయిని బట్టి, వారి విశిష్టతను బట్టి సమాధులు నిర్మితమయ్యాయి.

ఈ రకంగా లక్షల సంఖ్యలో వున్న సమాధులలో ఛార్లెస్ ఫిలిప్ బ్రౌన్ సమాధిని అన్వేషించి, కనుగొనడానికి మాకు దాదాపు 3 గంటల సమయం పట్టింది. సెమెట్రీ నిర్వాహకురాలు శ్రీమతి ఎవిస్ మాకు మ్యాపునిచ్చి వెతుక్కోమన్నారు.

29,377వ సమాధిగా నమోదు చేయబడిన సి.పి. బ్రౌన్ సమాధిపై ఆయన 17 డిసెంబర్ 1884న (మరణించిన ఐదవ రోజున) ఖననం చేయబడినట్లు చెక్కబడివుంది. ఈ సమాచారం పొందడానికి 2 డాలర్ల రుసుము చెల్లించవలసి వచ్చింది. సమాధులు చూసుకుంటూ, వెతుక్కుంటూ వెళుతుంటే ఒక ఆంగ్ల వనిత – ఆమె కూడా ఏదో సమాధి అన్వేషణలో తిరుగుతూ మాకు తారసపడ్డది. ఆమె మాతో మాటలు కలిపి, మా అన్వేషణలో తోడ్పడింది. చివరికి బ్రౌన్ సమాధిని చూడగానే పడిన శ్రమంతా మరచిపోయాము. ఒకానొక దశలో సమాధిని చూడకుండానే వెళ్ళిపోతామేమో అన్న భావన కలిగి మనసంతా వికలమైంది. అలాంటి సమయంలో సమాధి కనిపిస్తే ఎంతటి మధురానుభూతి కలుగుతుందో వర్ణించలేను. సమాధి కనిపించిందన్న ఆనందం ఒక వైపు కలిగితే, ఆ సమాధి వున్న దుస్థితి మూలంగా కలిగిన వేదన ఇంతా అంతా కాదు. సమాధి మీద అక్షరాలు కనిపించీ కనిపించకుండా వున్నాయి. డా. లక్ష్మీప్రసాద్‌గారు అక్కడున్న గడ్డి మొక్కలను పీకి, ఆ సమాధి అక్షరాలపై రుద్దితే, బ్రౌన్ పేరు కనిపించింది.

ఆ రోజు రాత్రి లండన్‌లో మాకు ఆతిథ్యమిచ్చిన డా. గోవర్ధన్‌రెడ్డిగారికి ఈ విషయం చెప్పాము. డా. గోవర్ధన్‌రెడ్డిగారు ఏది ఏమైనా దానికి పునరుద్ధరణ చేయవలసిందేననీ, అందుకు ప్రయత్నిస్తాననీ చెప్పారు. మర్నాడు

రాత్రి లండన్ తెలుగు అసోసియేషన్ అధ్యక్షులు డా. రాముల దాసోజు మమ్మల్ని విందుకు ఆహ్వానించారు. వారితో నాకు అంతకుపూర్వం పరిచయం లేదు. డా. లక్ష్మీప్రసాద్‌గారి ద్వారా కలిగిన పరిచయమది. స్వర్గీయ ఎన్.టి. రామారావుగారు లండన్‌లో పర్యటించిన సందర్భంలో వారి ఇంటనే బసచేసిన విషయాన్ని రాముల దంపతులు గుర్తు చేసుకున్నారు.

మేము బ్రౌన్ సమాధి గురించి, దాని దురవస్థ గురించి వారి దృష్టికి తెచ్చాము. వారు తమ సంఘ సభ్యులతో చర్చించి, దాని పునరుద్ధరణకు పూనుకుంటామని మాటిచ్చారు. ఈ రోజున దాదాపు 2 లక్షలు వ్యయం చేసి బ్రౌన్ సమాధిని లండన్ తెలుగు సంఘం వారు పునరుద్ధరించడం యావత్ తెలుగు జాతికి ఎంతో ఆనందదాయకం. ఇందుకుగాను లండన్ తెలుగు సంఘాన్ని ఎంత అభినందించినా తక్కువే అవుతుంది. లండన్ సందర్శనకు వెళ్ళే ప్రతి తెలుగువాడు కెన్‌సల్ గ్రీన్ స్మశాన వాటికలో సి.పి. బ్రౌన్ సమాధిని సందర్శించడం ద్వారా అదొక యాత్రా స్థలంగా రూపుదిద్దుకొంటుందని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

శ్రీ సి.పి. బ్రౌన్ ఫోటో ఇంతవరకు లభ్యం కాలేదు. ఇంగ్లాండులో ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. ఏదో ఒకరోజున ఆ ఫోటో కూడ లభ్యం కావాలని కోరుకుంటున్నాను. ప్రస్తుతం మనం బ్రౌన్ ఊహాచిత్రాన్నే ఉపయోగిస్తున్నాము.

మేము లండన్ పర్యటనకు వెళ్ళివచ్చిన పిమ్మట బ్రౌన్ సమాధి గురించి పత్రికలలో చదివిన వారిలో కొందరు లండన్ వెళ్ళినపుడు బ్రౌన్ సమాధిని చూసి వచ్చామని ఎంతో సంతోషంగా చెప్పారు. వారిలో తిరుమల తిరుపతి దేవస్థానాల పూర్వపు అధ్యక్షులు శ్రీ భూమన కరుణాకరరెడ్డిగారు ఒకరు.

మేము ఆ స్మశానవాటిక సందర్శనకు వెళ్ళినపుడు దానికి ఇన్‌ఛార్జిగా వున్న శ్రీమతి ఎవిస్ "ఈ సమాధిని సందర్శించడానికి వచ్చినవారు మాకు

తెలిసినంతవరకు మీరే" అని చెప్పారు. ఆ విషయం పత్రికలలో రావడం, దానిమీద అంతకు పూర్వమే సమాధిని సందర్శించినవారు "మేము ఎప్పుడో చూశామ"ని ప్రకటనలు చేయడంతో అదొక వివాదంగా పరిణమించింది. అయితే, దీనివల్ల తెలుగువారందరికీ బ్రౌన్ సమాధి గురించి తెలుసుకునే అవకాశం కలిగి, గొప్ప కుతూహలాన్ని రేకెత్తించింది. కీడులో మేలన్నట్లుగా ఈ వివాదం ద్వారా బ్రౌన్ సమాధి ప్రశస్తిని అందరూ గుర్తించే అవకాశం లభించింది.

ఏదిఏమైనా ఈ రోజున లండన్ తెలుగు సంఘం ఒక మహత్తరమైన కృషి జరిపి, తెలుగు భాషా భానుణ్ణి మళ్ళీ ప్రకాశింపజేసింది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ లండన్ అధ్యక్షులు డా॥ రాములు దాసోజుకు, వారి కార్యవర్గానికి తెలుగు ప్రజలందరి తరఫున హృదయ పూర్వక కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.




కెన్సల్ గ్రీన్ స్మశానవాటిక నిర్వాహకురాలు శ్రీమతి ఎవిన్‌తో...

# తెలుగు భగీరథుడు
# సర్ ఆర్థర్ కాటన్

**"నిత్య గోదావరీ స్నానపుణ్యదోయోమహామతిః**
**స్మరామ్యాంగ్లేయదేశీయం, కాటనుం తం భగీరథం"॥**

ఒక వేదపండితుడు గోదావరిలో స్నానమాచరిస్తూ, అత్యంత భక్తి శ్రద్ధలతో పై శ్లోకం పఠించి, పూజలొనరుస్తుంటే, ఆ శ్లోకంలోని "కాటన్" అన్న పదం వినపడి, ఆ దారిన గుర్రం మీద వెళుతున్న తెల్లదొర ఒక్కసారిగా గుర్రాన్ని నిలిపి, ఆ పండితుణ్ణి పిలిచి, దాని అర్థమేమిటని ప్రశ్నిస్తాడు. "పవిత్ర గోదావరీ జలాలతో అనుదినం స్నానపానాదులాచరించగల పుణ్యఫలాన్ని మాకు ప్రసాదించిన మహానుభావుడు, భగీరథతుల్యుడు, ఆంగ్లదేశీయుడైన కాటన్‌ను స్మరిస్తున్నాను" అని దానర్థాన్ని వేదపండితుడు చెబుతాడు. అంతట ఆ తెల్లదొర "కాటన్ జీతం తీసుకుని పనిచేసే



ఒక ప్రభుత్వ ఉద్యోగి. ఆనకట్టలుకట్టి, కాల్వలు త్రవ్వి పంటలకు నీరందించడం ఆయన ఉద్యోగ ధర్మం. ఆయన తన విద్యుక్త ధర్మాన్ని మాత్రమే నిర్వర్తించాడు. అంతమాత్రానికే మీరాయనను దేవునిగా భావించి,

ఆరాధించాలా" అని అంటాడు. అంతట ఆ పండితుడు "దొరగారూ! విద్యుక్త ధర్మనిర్వహణ దైవలక్షణం. అట్టి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించే వారెవరైనా దైవ స్వరూపులే. ఈ గౌతమీ మండలాన్ని గోదావరీ జలాలతో సస్యశ్యామలం చేసి, మా బ్రతుకుల్లో పాలు పోశారు కాటన్ దొరగారు. అందుకే ఆ మహనీయుణ్ణి స్మరించుకుంటున్నాను" అని సమాధానం ఇస్తాడు. ప్రక్కనే ఉన్న దుబాసి మీరు ఆరాధిస్తున్న కాటన్ దొరగారు వీరేనని పండితునికి చెబుతాడు. "దొరగారూ! మీ దర్శన భాగ్యంతో నా జన్మ తరించిందని ఆ పండితుడు కాటన్ దొరకు సాష్టాంగ ప్రణామం చేస్తాడు.

తాను పడిన శ్రమకు ప్రజల నుంచి అంత గుర్తింపు లభించినందుకు కాటన్ కళ్ళ నుంచి ఆనందాశ్రువులు రాలాయి. 150 సంవత్సరాలుగా ఆ శ్లోకం గోదావరీ తీరాన ప్రతిధ్వనిస్తూనే ఉంది. కాటన్ ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా ఈ నాటికీ నిలిచే ఉన్నాడు.

**నీటిపారుదల పితామహుడు 'జలప్రదాత' సర్ ఆర్థర్ కాటన్**

గోదావరి, కృష్ణా నదుల మీద ఆనకట్టలు కట్టడం ద్వారా అక్కడి బంజరు భూములన్నింటినీ సస్యశ్యామలంగా మార్చవచ్చని బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఒప్పించడంలో సఫలీకృతుడైన కాటన్ దొర గోదావరి నది మీద 1847-52 సంవత్సరాల మధ్య, కృష్ణా నది మీద 1852-1855 సంవత్సరాల మధ్య ఆనకట్టలను నిర్మించాడు. ఈనాడు కృష్ణా, గోదావరి జిల్లాలు సస్యశ్యామలంగా, పాడిపంటలతో విలసిల్లుతున్నాయంటే దానికి కారణం ఆ మహనీయుడే.


11.4.1970న ఆంధ్రజ్యోతి సంపాదకీయంలో శ్రీ నార్లవెంకటేశ్వరరావు ఈ విధంగా వ్రాశారు : "ప్రధాని నెహ్రూ నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయడానికి వచ్చినప్పుడు ఒక రైతు ఆయనతో 'ఇది మీరు పెట్టిన దీపమే' అన్నాడు. నాగార్జున సాగర్ నెహ్రూ పెట్టిన దీపం కాగా, గోదావరి ఆనకట్ట, అంతకు నూరేళ్ళకు ముందు సర్ ఆర్థర్ కాటన్ పెట్టిన దీపం. దక్షిణ భారతంలో కాటన్ పెట్టిన పెక్కు దీపాల్లో అదొకటి. కాటన్ ఆనాడు పెట్టిన

దీపం తెలుగు గడ్డకు వెలుగు నిచ్చింది. తెలుగు బిడ్డకు అన్నం పెట్టింది. గంగను స్వర్గం నుంచి భగీరథుడు భూతలానికి తెచ్చినాడన్న పురాణగాథ నిజమోకాదో కానీ, వృథాగా సముద్రం పాలైపోతున్న గోదావరీ జలాలను లక్షలాది ఎకరాల పంట పొలాలకు మళ్ళించిన అపర భగీరథుడు మాత్రం నిశ్చయంగా సర్ ఆర్థర్ కాటన్" అని శ్రీ నార్ల కొనియాడారు.

"సర్ ఆర్థర్ కాటన్ ఆనాడు అంత కొద్దిపాటి వ్యయంతో (రూ. 15,34,000/-) నిర్మించిన గోదావరి ఆనకట్ట బ్రిటిష్ ఇండియాలోని ఇంజనీరింగ్ నైపుణ్యానికి అత్యద్భుతమైన చిహ్నంగా విశేష ప్రశంసలు పొందింది. 1846లో రాజమండ్రి జిల్లా జన సంఖ్య 5,61,041గా ఉండేది. 1891 నాటికి అది 20,78,782కు పెరిగింది. 1844లో రాజమండ్రి జిల్లా నుంచి లభించే అన్ని రకాల రెవెన్యూ రూ. 17,25,841/-లు ఉండేది. 1898 నాటికి ఒక ల్యాండ్ రెవెన్యూ మాత్రమే రూ. 60,19,224/-లకు పెరిగింది. ప్రభుత్వ దృష్టితో చూసినపుడు సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన ఆనకట్టకు ఇంతకు మించిన యోగ్యతా పత్రం ఏమికావాలి" అని శ్రీ నార్లవారు ప్రశ్నించారు.

సుప్రసిద్ధ ఇంజనీరు మాజీ కేంద్ర జల విద్యుత్ శాఖామంత్రి శ్రీ కె.యల్. రావు "ఇండియాలో దక్షిణ దేశమున సర్ ఆర్థర్ కాటన్ నిర్వహించిన సేద్యపు నీటి పారుదల పనులకు కరవు కాటకాల బారి నుండి లక్షలాది ప్రజలు శాశ్వతంగా రక్షింపబడుటయే కాక, కృష్ణాగోదావరి డెల్టా ప్రాంతాలు అభివృద్ధి మార్గాన పయనించాయి. అతని కృషి ఫలితాలు కొండపై కోటవలె అందరికీ అగుపడుచున్నవి" అన్నారు.

కాటన్ పుణ్యమా అని ఈ రెండు ఆనకట్టలప్రాంత రైతులు పేదరికం నుంచి స్వంత సాగుకు ఎదిగారు. ఒక పటిష్టమైన మధ్య తరగతి రైతాంగం ఆవిర్భవించింది. సంపన్న వర్గానికి, పేదవర్గానికి నడుమ ఈ మధ్య తరగతి రైతాంగవర్గం అవతరించింది. రైతాంగ వర్గాలకు సాంఘిక హోదా సంపాదించడానికి, వారి సంతానాన్ని విద్యావంతులను చేయడానికి



డార్కింగ్ స్మశానవాటిక సుందర దృశ్యం



డార్కింగ్‌లో సర్ ఆర్థర్ కాటన్ సమాధివద్ద శ్రీ మండలి, డా॥ యార్లగడ్డ.




సర్ ఆర్థర్ కాటన్ ఒకప్పటి నివాసగృహం నేటి గార్థ్ నర్సింగ్ హోమ్

దోహదపడింది. ఆ రీతిన ఏర్పడిన మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారమే మేమంతా. అందుకే ఆ మహనీయుని పట్ల ఆరాధనా పూర్వకమైన కృతజ్ఞతాభావం.

**డార్కింగ్‌లో కాటన్ సమాధి**

సర్ ఆర్థర్ కాటన్ డార్కింగ్ పట్టణంలో చనిపోయినట్లు తెలుసుకుని, డార్కింగ్ సెమెట్రీ ఫోన్ నంబర్లను నెట్ ద్వారా సేకరించి, వారికి ఫోన్ చేసి, కాటన్ సమాధి గురించి వాకబు చేశాము. ఆ సెమెట్రీలో ఆయన సమాధి వుందని సెమెట్రీవారు చెప్పిన మీదట ఆ మహనీయుడి యొక్క స్మృతి చిహ్నాల కోసం ఆ పట్టణానికి డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, శ్రీ బోయపాటి ప్రమోద్‌లతో కలసి లండన్ నుంచి రైల్లో బయలుదేరి డార్కింగ్ చేరుకున్నాము. రైల్వే స్టేషన్‌కు ఒక కిలోమీటరు దూరంలోనే డార్కింగ్ సెమెట్రీ ఉంది. ఆ సెమెట్రీలో ప్రవేశించిన మేము ఆశ్చర్యపోయాము. అది స్మశానవాటికలా కాక, సుందర ఉద్యానవనంలా అందమైన కట్టడాలతో పచ్చిక బయళ్ళతో, రకరకాల పూల మొక్కలతో చూడచక్కగావుంది.

బ్రిటన్‌లోని డార్కింగ్ పట్టణంలో ఉన్న ఈ సెమెట్రీ 21 నవంబర్ 1855లో ప్రారంభమైంది. "బాక్స్ హిల్" కొండను ఆనుకుని ప్రశాంత వాతావరణంలో 14 ఎకరాలలో విస్తరించి ఉన్న చరిత్ర ప్రసిద్ధిగాంచిన ఈ స్మశాన వాటిక ఇప్పటికీ వాడుకలో ఉంది.

సెమెట్రీ నిర్వాహకులు మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి, సర్ ఆర్థర్ కాటన్ సమాధి వద్దకు తీసుకువెళ్ళి చూపారు. కాటన్ సమాధి గురించి, అక్కడవున్న ఇతర పెద్దల సమాధుల గురించిన వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. అందులో సర్ ఆర్థర్ కాటన్ గురించిన వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి.

"జనరల్ సర్ ఆర్థర్ కాటన్ బర్మా యుద్ధంలో ప్రశంసనీయమైన సేవలందించిన పిమ్మట, తన శేష క్రియాశీల జీవితాన్నంతా భారీ నీటిపారుదల

ప్రాజక్టులు, ఆనకట్టలు, వంతెనలు, చెరువులు, నీటిపారుదల కాలువలు నిర్మించడంలో భారతదేశంలోనే గడిపారు. "నీటిపారుదల కాటన్" గా ఈయన పేరు భారతదేశమంతటా ఈ రంగంలో సాధికారికతను సంతరించుకోవడమే కాక, ఈయన పథకాలన్నీ అత్యంత లాభదాయకమైనవిగా ప్రభుత్వంచే గుర్తింపు పొందాయి. నీటి పారుదల పథకాలపై ఆయనకు గల అత్యుత్సాహం మూలంగా రైల్వేల వంటి ఆధునిక వనరుల ప్రయోజనాన్ని గుర్తించడానికి కూడా ఇష్టపడలేదు. భవిష్యత్తులో సంపద అభివృద్ధి అంతా నీటి కాలువల పైనే ఆధారపడి ఉంటుందని ఆయన దృఢంగా విశ్వసించారు. "మస్తిష్కంలో జలంతో బాధపడుతున్న ఏకలక్ష్య వ్యక్తిగా" ఆయనను కొందరు విమర్శకులు అభివర్ణించేవారు.

సర్ ఆర్థర్ కాటన్ తన విశ్రాంత జీవితాన్ని గడపడానికి డార్కింగ్ పట్టణానికి చేరుకుని, 1870 సంవత్సరాంతం వరకు తూర్పు హ్యారో రోడ్‌లోను, ఆ తరువాత టవర్ హిల్ రోడ్‌లోని ఉడ్ కాట్ (ఇక్కడ ప్రస్తుతం గార్థ్ నర్సింగ్ హోం నడుస్తున్నది) లోను ప్రశాంతమైన జీవితం గడిపారు. ఇక్కడ కూడ ఆయన వ్యవసాయరంగంలో మెరుగైన పద్ధతులు ప్రవేశపెట్టడానికి, ముఖ్యంగా లోతుగా నేలను దున్ని చేసే సేద్యం గురించి ఎంతో కృషి చేశారు. అయితే, భూమిని దున్నడానికి ఆయన ప్రత్యేకంగా రూపొందించిన పొడవైన పళ్ళను పోలిన పరికరాల పట్ల స్థానిక కార్మికులలో ఏర్పడ్డ అపోహల మూలంగా ఈ ప్రయత్నం విజయవంతం కాలేక పోయింది. రిక్షా వంటి మూడు చక్రాల వాహనంలో తిరుగుతూ, ఆయన చేసిన ధార్మిక ప్రచారాల మూలంగాను, ఇతర సామాజిక సేవా కార్యక్రమాల మూలంగాను పట్టణంలో అందరికీ ఆయన సుపరిచితుడైనారు. తన అవిశ్రాంత కృషే, తన ధీర్ఘాయువు యొక్క రహస్యమని ఆయన అనేవారు.

డార్కింగ్ పట్టణంలోని శ్రామికులను వారి పని వేళల్లో బీరు త్రాగే అలవాటు నుంచి మాన్పడానికి ఆర్థర్ కాటన్ వంటింట్లో తయారు చేసుకోవడానికి వీలైన ఒక రకం సూపును రూపొందించి ప్రచారం చేశారు.


ఆయన అంత్యక్రియలు 30 జూలై 1899న డార్కింగ్ పట్టణం స్మశానవాటికలో పాక్షికమైన సైనిక లాంఛనాలతో జరిగాయి. "ది క్వీన్స్" అనబడే రెండవ వాలంటీర్ బ్రిగేడ్‌కు చెందిన సైనిక దళం ఒకటి శవయాత్రకు ముందు నడిచి, సమాధి మీదుగా తుపాకులు పేలుస్తూ, సైనిక వందనం చేసింది. రివరెండ్ జి.పి. క్విక్ ఆఫ్ డగ్లస్, కార్క్, రెవరెండ్ ఎఫ్.ఇ. ఆల్ట్, క్యూరేట్ ఆఫ్ సెయింట్ మేరీస్ డెవోన్స్ పోర్ట్ అంత్యక్రియలకు హాజరైనారు. ఆయన శవపేటికను ఆయన ఉపయోగించిన ఖడ్గంతోను, రాయల్ ఇంజనీర్స్ సమర్పించిన పుష్పగుచ్ఛంతోను అలంకరించడం జరిగింది.

కాటన్ నివసించిన ఇంటి గురించి సెమెట్రీ నిర్వాహకులనడుగగా, ఇప్పుడు ఆ ఇంట్లో గార్థ్ నర్సింగ్ హోం ఉన్నట్లు చెప్పారు. ఒక టాక్సీని పిలిచి మమ్మల్ని అక్కడకు పంపారు. సర్ ఆర్థర్ కాటన్ నివసించిన ఆ ఇల్లు చాలా అందమైన భవనం. పూర్తిగా టేకు చెక్కతో నిర్మితమైంది. అందులో ఇప్పుడు "గార్థ్ హోం" పేరిట వృద్ధుల శరణాలయం నడుస్తున్నది. 1949లో బ్రిటీష్ రాణి వ్యక్తిగత వైద్యుడు లార్డ్ హోర్టెన్ దీనిని స్థాపించాడు. ఈ భవనం విశాలమైన పచ్చిక బయళ్ళతోను, ఎత్తైన రకరకాల వృక్షజాతులతోను, పూల చెట్లతోను అలరారుతున్నది. డార్కింగ్ పట్టణంలో పోస్టాఫీసు, బ్యాంకులు, షాపింగ్ స్థలాలు వంటి అన్ని ముఖ్యమైన ప్రదేశాలకు ఈ భవనం అతి చేరువలో వుంది. ఈ నర్సింగ్ హోం అక్కడి వృద్ధులకు ప్రశంసనీయమైన సేవలందిస్తున్నది.

సర్ ఆర్థర్ కాటన్ సేవలన్నీ కూడా భారతదేశానికే పరిమితం కావడంతో, బ్రిటన్‌లో ఆయనకు ఒక సైనికాధికారిగానే తప్ప వేరే గుర్తింపులేదు. ఆయన స్మృతి చిహ్నాన్ని చూడటానికి సెమెట్రీకి వెళ్ళగా అక్కడివారు ఆశ్చర్యపోయారు. "మేము రెండు పూటలా భోజనం చేయడానికి ఆ మహానుభావుడే కారణమనీ, అందుకే ఆయనకు శ్రద్ధాంజలి ఘటించడానికి ఇంత దూరం వచ్చామనీ వారికి తెలియజేశాను. కాటన్ సమాధిని సందర్శించడానికి ఇంతకు పూర్వం వెళ్ళినవారి గురించి తెలియదు కానీ, మేము మాత్రం ఆ మహానుభావుడికి

తెలుగు జాతి పక్షాన, ప్రత్యేకించి కృష్ణా గోదావరి డెల్టా వాసుల పక్షాన శ్రద్ధాంజలి ఘటించినందుకు ఆనందించాము.

**రాబర్ట్ చార్లెస్ కాటన్ రాష్ట్ర పర్యటన**



మేము లండన్ పర్యటన ముగించుకుని తిరిగివచ్చిన తరువాత కాటన్ సమాధి సందర్శన గురించి పత్రికలలో వార్తలు చూసిన ముఖ్యమంత్రి డా॥ వై.ఎస్. రాజశేఖరరెడ్డిగారు మమ్ములను పిలిపించి కాటన్ వారసులెవరైనా ఉంటే వారిని మన రాష్ట్రానికి ఆహ్వానించి సత్కరిద్దామని చెప్పారు.


కాటన్ శత వర్ధంతి సందర్భంగా కాటన్ మునిమనుమడు ఛార్లెస్ రాబర్ట్ కాటన్ మన రాష్ట్రానికి వచ్చినట్లు గుర్తు. అయితే వారి చిరునామా మాకు లభ్యం కాలేదు. డా॥ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ పట్టువదలని విక్రమార్కుడిలా ఇంగ్లాండులోని ఒక ప్రైవేటు ఏజన్సీ ద్వారా చార్లెస్ రాబర్ట్ కాటన్ చిరునామా సేకరించి మరలా ఇంగ్లాండు వెళ్ళి హెన్లీ–ఆన్–థేమ్స్‌లో వారి నివాసంలో కలసి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డిగారి ఆహ్వానాన్ని అందజేశారు.

సర్ ఆర్థర్ కాటన్ స్ఫూర్తిగ రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో పెండింగ్ ప్రాజక్టుల నిర్మాణానికి "జలయజ్ఞం" ప్రారంభించారు రాజశేఖరరెడ్డిగారు.


బృహత్తరమైన జలయజ్ఞాన్ని ప్రారంభించిన డా॥ రాజశేఖరరెడ్డిని కొనియాడుతూ భారత ప్రధాని డా॥ మన్మోహన్ సింగ్ "అభినవ కాటన్"గ అభివర్ణించారు. రాబర్ట్ సి. కాటన్‌ని ఆహ్వానిస్తూ జులై 29, 2009న డా॥ రాజశేఖరరెడ్డిగారు వ్రాసిన లేఖ ఈవిధంగా ఉంది.

**ప్రియమైన కాటన్ గారికి,**

ప్రఖ్యాత ఇంజనీరు స్వర్గీయ సర్ ఆర్థర్ కాటన్‌గారు భారతదేశంలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయదారులకు వరప్రసాదం లాంటి నీటి



హైదరాబాద్ చార్మినార్ వద్ద చార్లెస్ రాబర్ట్ కాటన్ దంపతులతో మండలి కుటుంబం



హెలికాప్టర్‌లో చార్లెస్ రాబర్ట్ కాటన్, మండలి

పారుదల అభివృద్ధికి చేసిన అవిరళకృషిని స్మరించుకోవడం మాకెప్పటికీ ఆనందదాయకంగానే ఉంటుంది.

వారిచ్చిన స్ఫూర్తితో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం "జలయజ్ఞం" పేరుతో నీటి పారుదల అభివృద్ధికి ఒక ప్రతిష్ఠాత్మకమైన బృహత్ ప్రణాళికను చేపట్టింది. ఈ ప్రణాళిక మూలంగా కోటి పదిహేను లక్షల ఎకరాల భూమి అదనంగా సాగుకు వస్తుంది. ఇందులో భాగంగా భారీ, మధ్యతరహా ప్రాజెక్టుల నిర్మాణం క్రొత్తగా చేపట్టడమే కాక, ఇప్పటికే ఉన్న నీటి వనరులను ఆధునీకరించడం జరుగుతున్నది. దీని మూలంగా వ్యవసాయోత్పత్తులు అపారంగా పెరిగి, రైతుల పరిస్థితి మెరుగు పడటమే కాక, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సర్వతోముఖంగా అభివృద్ధి చెందగలదని ఆశిస్తున్నాము.

సర్ ఆర్థర్ కాటన్ నీటిపారుదల విషయంలో ఈ రాష్ట్రానికి చేసిన గణనీయమైన కృషికి గుర్తుగా వారిపేర 2009 నవంబర్ / డిసెంబర్ మాసంలో ఒక సన్మాన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని భావిస్తున్నది. ఆంధ్రప్రదేశ్ హిందీ అకాడమీ అధ్యక్షులు, మాజీ పార్లమెంటు సభ్యులు ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. సర్ ఆర్థర్ కాటన్ వంశానికి చెందిన మిమ్మల్ని వారి వారసులుగా ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పక్షాన ఆహ్వానిస్తున్నాను.

దీనిని నా వ్యక్తిగత ఆహ్వానంగా కూడా భావించి భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని హైదరాబాదు నగరానికి విచ్చేసి, రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా ఈ చారిత్రాత్మక సన్నివేశంలో పాల్గొని, ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడానికి తోడ్పడవలసిందిగా అభ్యర్థిస్తున్నాను.

గౌరవాభినందనలతో,

మీ

**వై.యస్. రాజశేఖరరెడ్డి**

జలయజ్ఞానికి స్ఫూర్తిప్రదాత అయిన సర్ ఆర్థర్ కాటన్ వారసులను రాష్ట్ర ప్రభుత్వం తరఫున సత్కరించాలన్న డా॥ రాజశేఖరరెడ్డిగారి ఆకాంక్ష నెరవేరకముందే వారు హెలికాప్టర్ ప్రమాదంలో అసువులు బాసి తెలుగుజాతిని దుఃఖ సముద్రంలో ముంచెత్తారు.

డా॥ రాజశేఖరరెడ్డిగారి అభిలాష మేరకు సర్ ఆర్థర్ కాటన్ మునిమనుమడు శ్రీ చార్లెస్ రాబర్ట్ కాటన్‌ని ఆహ్వానించి అనుకున్న ప్రకారం కార్యక్రమం నిర్వహించాలని ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్య ఆదేశించారు. భారీనీటిపారుదల శాఖామంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య రాష్ట్రంలోని మూడు ప్రాంతాల్లో నిర్మితమవుతున్న ప్రాజక్టులను చార్లెస్ రాబర్ట్ కాటన్‌కు చూపించి సర్ ఆర్థర్ కాటన్ స్ఫూర్తిని రాష్ట్ర ప్రభుత్వం కొనసాగిస్తున్న తీరుని వారికి తెలియజెప్పే విధంగా కార్యక్రమాన్ని రూపొందించారు.


2009 నవంబరు నెలలో 10 రోజుల పాటు చార్లెస్ రాబర్ట్ కాటన్ దంపతులు రాష్ట్ర ప్రభుత్వ అతిథులుగా రాష్ట్రమంతటా పర్యటించారు. గండికోట ప్రాజెక్టు నిర్మాణాన్ని చూసి, ఇడుపులపాయకు వెళ్లి, దివంగత రాజశేఖరరెడ్డిగారికి శ్రద్ధాంజలి ఘటించి, పులిచింతల ప్రాజెక్టును సందర్శించి, విజయవాడలో కృష్ణా డెల్టా రైతాంగ సన్మానాన్ని స్వీకరించారు. కాటన్ దంపతులు ఆ పిమ్మట గోదావరి బ్యారేజిని చూసి, రాజమండ్రిలో సన్మానం పొందారు. విశాఖపట్నంలో సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన చర్చిని సందర్శించి, విశాఖవాసుల ఘన సన్మానాన్ని అందుకున్నారు. యల్లంపల్లి ప్రాజెక్టును సందర్శించి, హైదరాబాదు నగరంలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ వారి సత్కారం అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్ శ్రీ నారాయణ్‌దత్ తివారిగారిని, ముఖ్యమంత్రి శ్రీ కె. రోశయ్యగారిని కలిసి, వారిచే ఘన సత్కారాలను అందుకుని, రాష్ట్ర ప్రజలకు, ప్రభుత్వానికి సర్ ఆర్థర్ కాటన్ పట్ల ఈనాటికీ గల చెక్కుచెదరని గౌరవాదరాలను ప్రత్యక్షంగా తిలకించి అబ్బురపోయారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నీటిపారుదల శాఖ పక్షాన మంత్రి శ్రీ పొన్నాల లక్ష్మయ్య ఘన సన్మానం చేసి, భారీ విందు ఏర్పాటు చేశారు. ఈ పర్యటనంతటికీ డా. యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సమన్వయకర్తగా వ్యవహరించారు.

సర్ ఆర్థర్ కాటన్ మునిమనుమడు చార్లెస్ రాబర్ట్ కాటన్ "ఆర్డర్ ఆఫ్ ది బ్రిటిష్ ఎంపైర్" సభ్యత్వ గౌరవాన్ని పొందారు. 1925 డిసెంబరు 31వ తేదీన ఇంగ్లండ్‌లోని లివర్‌పూల్‌లో ఆయన జన్మించారు. డెర్బీషైర్‌లోని రిప్టన్ స్కూలులోనూ, కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి చెందిన మెక్‌డవిన్ కాలేజిలోను చదివి, మెకానికల్ సైన్సెస్ మరియు సివిల్ ఇంజనీరింగులో రోస్టర్ డిగ్రీ పొందారు. నేషనల్ కమిషన్డ్ రాయల్ ఇంజనీరింగు పక్షాన 1946-48 సంవత్సరాల మధ్య భారతదేశంలోను, పాలస్తీనాలోను పనిచేశారు. ఇంటర్నేషనల్ ప్యాకింగ్ కంపెనీ, మెటల్ బాక్స్‌లో వివిధ హోదాలలో పనిచేసి, 1933 సంవత్సరంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పదోన్నతి పొందారు. 1952-54 సంవత్సరం మధ్య మెటల్ బాక్స్ కంపెనీ కలకత్తా కార్యాలయంలో పనిచేశారు. వీరి భార్య శ్రీమతి నికోలెట్ ఆనీకస్లీవ్. వీరికి నలుగురు పిల్లలు, 13 మంది మనుమలు, మనుమరాళ్లు ఉన్నారు. ఉద్యోగ విరమణానంతరం సమాజ సేవలో తమ జీవితాన్ని గడుపుతున్నారు. చార్లెస్ రాబర్ట్ కాటన్ 84 సంవత్సరాల వయసులో రాష్ట్ర ప్రభుత్వ అతిథిగా మన రాష్ట్రంలో పర్యటించడం హర్షదాయకం.

చార్లెస్ రాబర్ట్ కాటన్ దంపతుల పర్యటనలో సర్ ఆర్థర్ కాటన్ పట్ల తెలుగు ప్రజలకున్న ఆరాధనాభావం అడుగడుగునా వ్యక్తమయింది. మా లండన్ పర్యటన ఫలితంగా ఈ కార్యక్రమం ఈ విధంగా రూపుదిద్దుకోవడం మాకెంతో సంతృప్తి నిచ్చింది.

★★★

# ఆంగ్లసాహిత్యానికి విశేష సేవలందించిన తెలుగుతేజం డా. గూటాల కృష్ణమూర్తి



తెలుగు భాషోద్ధరణకు ఎనలేని సేవ లందించిన ఆంగ్లేయుడు సి.పి. బ్రౌన్ గురించి మనం ఇంతకు ముందే తెలుసుకున్నాము. ఆంగ్ల సాహిత్యానికి విశేష సేవలందించిన తెలుగు తేజం డా. గూటాల కృష్ణమూర్తి. 1890 సంవత్సరం నుంచి 1900 సంవత్సరం వరకు ఆంగ్ల సాహిత్యానికి స్వర్ణయుగమని నిరూపించిన మహోన్నత సాహిత్యమూర్తి డా॥ గూటాల కృష్ణమూర్తి. వారి ఆంగ్ల సాహిత్యసేవను చూస్తే, బ్రౌను తెలుగు సాహిత్యానికి చేసిన సేవతో సరితూచవచ్చు. బ్రౌనుకు తెలుగు జాతి పడిన రుణాన్ని కృష్ణమూర్తిగారు ఈ రీతిగ తీర్చాడనిపిస్తున్నది.

మా లండన్ పర్యటనలో డా. గూటాల కృష్ణమూర్తిని కలవడం ప్రధానమైన అంశం. 1975లో విదేశాంధ్ర ప్రచురణలు అనే సంస్థను లండన్‌లో ప్రారంభించి, పురిపండ అప్పలస్వామిగారి "పులిపంజా" కవితాసంపుటిని సర్వాంగసుందరంగా విదేశాల్లో ప్రచురించి, హైదరాబాదు 'కళాభవన్‌లో ఆనాటి విద్యాసాంస్కృతిక శాఖామాత్యులైన మా నాన్నగారు మండలి వెంకట కృష్ణారావుగారి చేతుల మీదుగా ఆవిష్కరణ చేయించడం, ఆ సందర్భంగా గూటాలవారిని నేను ప్రత్యక్షంగా చూడటం జరిగింది.


పచ్చని మేని ఛాయతో సూటు, బూటులో తెల్లదొరలా కనిపించేవారు.

కృష్ణాజిల్లా రచయితల సంఘం 2006 అక్టోబరు 27-28 తేదీలలో విజయవాడలో జాతీయ తెలుగు రచయితల మహాసభలను డా. గూటాల కృష్ణమూర్తిగారితో ప్రారంభింపజేయడం జరిగింది. అలాగే 2007 సెప్టెంబరు 21, 22, 23 తేదీలలో అపూర్వమైన రీతిలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకు వీరు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ రెండు కార్యక్రమాల్లో నా ఆహ్వానాన్ని మన్నించి వారు పాల్గొన్నారు.

విశ్వవిఖ్యాత గాయని, నటీమణి శ్రీమతి టంగుటూరి సూర్యకుమారిపై అపురూప గ్రంథం "సూర్యకుమారి ఇల్విన్ - ఎ మెమోరియల్ వాల్యూమ్' ను 2003 నవంబరు 13వ తేదీన సుప్రసిద్ధ సినీ నటుడు పద్మభూషణ్ డా. అక్కినేని నాగేశ్వరరావుగారి చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. ఆ సభకు అధ్యక్షత వహించే అవకాశం డా. గూటాల కృష్ణమూర్తిగారు నాకు కల్పించారు. తెలుగు ప్రచురణ రంగ చరిత్రలో అరుదైన, అపురూపమైన గ్రంథాన్ని వారు రూపొందించారు.

డా. కృష్ణమూర్తిగారితో చిరకాల పరిచయం ఉండటం వలన మా లండన్ పర్యటనలో వారి ఇంటికి వెళ్లాను. మొదటి అంతస్థులో వారి నివాసం. ఇల్లంతా పుస్తకాలమయంగా కనిపించింది. చివరికి బాత్‌రూముల్లో కూడా పుస్తకాల దొంతరలే. అవి మామూలు పుస్తకాలు కావు. ఎక్కడా దొరకని అపురూప గ్రంథాలు. ప్రత్యేకించి, 1890 దశకంలో వెలువడిన గ్రంథాలు వీరి వద్ద మాత్రమే ఆ దేశంలో లభ్యమవుతాయి. ఆంగ్ల సాహిత్య పరిశోధకులు వాటి కోసం వారింటికి వచ్చి వెళుతుంటారు. సుప్రసిద్ధులకు సంబంధించిన లేఖలను, వస్తువులను భద్రపరచడం వారికి అలవాటు. సర్ ఆర్థర్ కాటన్ స్వదస్తూరితో వ్రాసిన లేఖలు వారివద్ద వున్నాయి. సరోజినీనాయుడు, తదితర ప్రముఖుల లేఖలు కూడా ఉన్నాయి. బ్రిటిష్ లైబ్రరీలో ఎప్పుడో వందేళ్ళ క్రితం తయారు చేసిన తెలుగు-ఉర్దూ నిఘంటువుకు సంబంధించిన మైక్రో ఫిల్మ్ కృషమూర్తిగారు నాకిచ్చారు.


అలాగే కృష్ణా ఆనకట్ట నిర్మాణ సమయంలో (1948 సం॥) చిత్రించిన



సర్ ఆర్థర్ కాటన్ స్వదస్తూరితో కూడిన లేఖ



సర్ ఆర్థర్ కాటన్ లేఖను చూపిస్తున్న డా॥ గూటాల



డా॥ గూటాల కృష్ణమూర్తితో శ్రీ మండలి బుద్ధప్రసాద్

రేఖా చిత్రాలు ఆనాటి నిర్మాణపు పనులకు దర్పణం పట్టేలాగా వారివద్ద ఉన్నాయి. ఇలాంటి అపురూపమైన సేకరణ ఎంతో వారివద్ద వుంది. 82 సంవత్సరాల వయసులో వంటరిగా వారక్కడ జీవిస్తున్నారు. వారి సతీమణి విశాఖపట్నంలో ఉంటారు. నేను వెళ్ళే సమయానికి వారంత ఆరోగ్యకరంగా లేరు. వారిని చూసి నా మనసంతా వికలమైంది. ఒక ఆంగ్లేయమిత్రుడు అప్పుడప్పుడు సహకారం అందిస్తూ ఆయన మంచి చెడ్డలు గమనిస్తూ వుంటాడని చెప్పారు. ఆయన శరీరం తగిన విధంగా సహకరించకపోయినా ఆయన మనస్సు మాత్రం శరవేగంగా పయనిస్తోంది.

"1890 – A Biographical Dictionary" రూపకల్పనలో ఆయన మునిగి తేలుతున్నారు. అయితే ఆయన ఎవరి సహాయం లేకుండా, అధునాతన శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం కూడా వినియోగించకుండా తనకు తానే డిక్షనరీని రూపొందిస్తున్నారు. ఇది ఎంత శ్రమతో కూడిన విషయమో వేరుగా చెప్ప పనిలేదు. దాన్ని పూర్తి చేయాలన్న పట్టుదలే ఆయనను ముందుకు నడిపిస్తున్నది.

విదేశాంధ్ర ప్రచురణల ద్వారా మహాకవి శ్రీశ్రీ చేతి వ్రాతతో ప్రచురించిన మహాప్రస్థానం గూటాలవారి తెలుగు సాహిత్యసేవకు మహోన్నత దర్పణంగా నిలుస్తుంది.

డా. గూటాల కృష్ణమూర్తి గాంధేయవాది. ఆయన మహాత్మాగాంధీ జన్మదినం అక్టోబరు 2వ తేదీన, నిర్యాణదినం జనవరి 30న ఉదయం 10.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటలవరకు, ఒక గంట విరామంతో, నిరంతరాయంగా రాట్నం వడుకుతారు. అదికాక ప్రతిరోజు రెండు గంటలు తప్పని సరిగా రాట్నం వడుకుతారు. ఈ అలవాటును ఆయన గత నాలుగు దశాబ్దాలుగా కొనసాగిస్తున్నారు. స్వదేశంలో చరఖా సంగతి అంతా మరిచి పోయినా, విదేశంలో ఉంటున్న కృష్ణమూర్తిగారు మాత్రం దీన్ని ఒక 'యోగం' గా శ్రద్ధాసక్తులతో ఆచరిస్తున్నారు.

అక్టోబర్ 2న, జనవరి 30న మాత్రం ఈ రాట్నం వడికే పనిని టాలిస్టాకీ స్క్వేర్‌లో గాంధీ విగ్రహం వద్ద రోజంతా కొనసాగిస్తారు. విదేశాల్లో గాంధీ తత్త్వాన్ని ప్రచారం చేస్తున్న నిస్వార్థ సేవాతత్పరుడు గూటాల కృష్ణమూర్తిగారు.

గూటాల గురునాథస్వామి, సుభద్రమ్మ దంపతులకు కృష్ణమూర్తిగారు 1928వ సంవత్సరంలో పర్లాకిమిడి గ్రామంలో జన్మించారు. ప్రస్తుతమిది ఒరిస్సా రాష్ట్రంలో ఉంది. తండ్రి మేజిస్ట్రేట్‌గా పనిచేశారు.

వీరి విద్యాభ్యాసం విజయనగరంలోను, విశాఖపట్నంలోను సాగింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి 1955లో ఎం.ఏ. ఇంగ్లీషు ఆనర్స్ పట్టా పుచ్చుకున్నారు.

1955–1958 మధ్య అమలాపురంలోను, 1958–62 మధ్య బిలాస్‌పూర్ లోను ఆంగ్లోపన్యాసకులుగా పనిచేశారు. నిరంతర చైతన్యవాహిని అయిన కృష్ణమూర్తిగారికి ఈ ఉద్యోగాలు సంతృప్తిని ఇవ్వలేకపోయాయి. పరిధులులేని ఆయన ప్రజ్ఞకు ఆకాశమే హద్దయింది.

1962లో రీసెర్చ్ కోసం ఇంగ్లాండ్ వెళ్ళారు. 1966లో మధ్యప్రదేశ్‌లోని సాగర్ విశ్వవిద్యాలయం నుంచి పిహెచ్.డి. పొందారు. 1968లో అమెరికా వెళ్లి 1972 వరకు బ్రిడ్జ్ వాటర్ స్టేట్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొవిడెన్స్ కాలేజిలో విజిటింగ్ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ఇది బోస్టన్ సమీపంలో ఉంది. 1972లో ఇంగ్లాండ్ తిరిగి వచ్చి, లండన్ గ్రామర్ స్కూలులో విదేశీ విద్యార్థులకు ఇంగ్లీషు బోధించారు.

విదేశాలలో నిరంతరం విద్యావ్యాసంగంలో తలమునకలవుతూ కూడా, తెలుగు భాషా సంస్కృతుల పరివ్యాప్తికి కృష్ణమూర్తిగారు అహరహం శ్రమించారు. పది సంవత్సరాల పాటు లండన్‌లోని ఆంధ్ర కల్చరల్ అసోసియేషన్‌కు అధ్యక్షులుగా పనిచేశారు. మా నాన్నగారు విద్యాసాంస్కృతిక శాఖామంత్రిగా ఉన్నప్పుడు విద్యాసాంస్కృతిక రంగాల్లో ప్రవాసాంధ్రులకు చేయూతనివ్వడానికి స్థాపించిన అంతర్జాతీయ తెలుగు సంస్థతో సన్నిహిత

సంబంధాలు పెట్టుకొని ఇంగ్లాండ్‌లో నివశిస్తున్న తెలుగువారి సంతానానికి తెలుగుభాషా సంస్కృతులను పరిచయం చేసి, వారికి తమ సాంస్కృతిక వారసత్వం పట్ల అవగాహన, ఆసక్తి కలిగించడానికి విశేషంగా కృషి చేశారు.

కృష్ణమూర్తిగారి అభిప్రాయం ప్రకారం 1890-1900 దశాబ్దం ఆంగ్ల సాహిత్యానికి స్వర్ణయుగం. ఆ దశాబ్దం ప్రాముఖ్యతను తెలియజెప్పడానికి కృష్ణమూర్తిగారు "1890's Society" అనే సాహిత్య సంస్థను స్థాపించి నిర్వహిస్తున్నారు. దాని పక్షాన పది జీవిత చరిత్రలు ప్రచురించారు.

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని"**

అన్న గురజాడ సందేశాన్ని ఆచరణాత్మకం చేసిన మహనీయ వ్యక్తి డా. గూటాల కృష్ణమూర్తి. ఆంగ్ల సాహిత్య చరిత్రలో తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంతరింపజేసుకున్న తెలుగుతల్లి ముద్దుబిడ్డడు డా॥ గూటాల కృష్ణమూర్తి.




విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభలలో
డా॥ గూటాలకు సత్కారం.



**మండలి బుద్ధప్రసాద్** 26-05-1956న జన్మించారు. వీరి తండ్రి శ్రీ మండలి వెంకట కృష్ణారావు రాష్ట్ర విద్యా, సాంస్కృతిక శాఖామాత్యులుగా పనిచేసి 1975లో ప్రప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి విశ్వవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరినీ ఒకే వేదిక పైకి తీసుకువచ్చిన ఘనత దక్కించుకున్నారు. శ్రీ బుద్ధప్రసాద్ తండ్రి అడుగుజాడలలో తెలుగు భాషా సంస్కృతుల వికాసానికి నడుంకట్టి పనిచేస్తున్నారు. తెలుగు భాష పరిరక్షణకు, తెలుగు ప్రాచీన హోదా సాధనకు సాగిన ఉద్యమాలకు సారథిగా నిలిచారు.

కృష్ణా జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు విజయవాడలో వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయలు 'ఆముక్తమాల్యద' రచించిన కృష్ణా జిల్లా శ్రీకాకుళంలో ఆంధ్ర మహావిష్ణు సన్నిధిలో శ్రీకృష్ణదేవరాయలు విగ్రహాన్ని నెలకొల్పారు.

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తున్న శ్రీ బుద్ధప్రసాద్ డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి మంత్రివర్గంలో పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖల మంత్రిగా పనిచేశారు. 1999, 2004లలో అవనిగడ్డ నియోజకవర్గ శాసనసభ్యునిగా పనిచేశారు. 12 సంవత్సరాలపాటు కృష్ణా జిల్లా కాంగ్రెసు సంఘ అధ్యక్షునిగా, ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. ఎ.ఐ.సి.సి. సభ్యులుగా వ్యవహరిస్తున్నారు.

శ్రీ బుద్ధప్రసాద్ మారిషస్, మలేషియా, థాయిలాండ్, సింగపూర్, చైనా, జర్మని, అమెరికా, ఇంగ్లాండు దేశాలలో పర్యటించి తన పర్యటన విశేషాలతో "మారిషస్‌లో తెలుగు తేజం", "ప్రజలు - ప్రగతి", "జర్మనీయానం" గ్రంథాలను రచించారు. ఇప్పుడు ఇంగ్లాండు దేశ పర్యటన విశేషాలతో "లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు" వెలువరిస్తున్నారు.

"లండన్‌లో తెలుగు వైభవ స్మృతులు" గ్రంథరచయిత శ్రీ మండలి బుద్ధప్రసాద్ తెలుగు భాషా సంస్కృతులపట్ల అపారమైన గౌరవాభిమానాలు కలవారు. ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, మత్స్యశాఖా మంత్రి హోదాలో ఇంగ్లాండులో పర్యటించిన శ్రీ బుద్ధప్రసాద్, తెలుగుజాతికి ప్రాతఃస్మరణీయులైన సి.పి. బ్రౌన్, సర్ ఆర్థర్ కాటన్ సమాధులను సందర్శించి నివాళులర్పించారు. బ్రిటీష్ మ్యూజియంలో అమరావతి శిల్పాలు, లండన్ టవర్ మ్యూజియంలో కోహినూరు వజ్రాన్ని తిలకించి ఆ విశేషాలను తెలుగు ప్రజలకు ఈ గ్రంథం ద్వారా అందిస్తున్నారు. ఇంగ్లాండుకు వెళ్ళే తెలుగు వారికి, ఈ గ్రంథం చక్కటి మార్గదర్శనం చేస్తుంది.

